

# ప్రముఖాంధ్ర

ప్రపంచ తెలుగుల మానస పత్రిక

జనవరి 2019

సంపుటి : 25 **289** సంచిక : 1



# శ్రీరామరక్షతు వెయ్యేళ్ల ఆయుష్షః!

ఆనాడు తల్లులు బిడ్డలకు తలంటే ముందు, నూనెను పెడుతూ 'శ్రీరామ రక్షతు- వెయ్యేళ్ల ఆయుష్షః' అని దీవించేవారు. ప్రస్తుతం అలా దీవించే తల్లులూ, శ్రీరాముణ్ణి గురించి, తీరిగ్గా తెలుసుకుని బిడ్డలకు జ్ఞానబోధలు చేసే తల్లులూ అరుదుగా ఉన్నారు. ఏతావాతా తెలిసిన వారున్నప్పటికినీ, వారు ఉద్యోగాల్లోనో, ఊళ్లేలే రాజకీయాల్లోనో తలమునకలై ఉంటున్నారు. ఒక వేళ వాళ్లకు తీరిక కల్గినా, సెక్యులర్ దేశం కాబట్టి, రామప్రస్థాపనెత్తకూడదు, భారతీయ పౌరసత్వంలో, భారత గాలులు పీలుస్తూ, ఆహార విహారాలు చేస్తూ ఉండవచ్చును గానీ, భారతీయ సాంప్రదాయాన్నీ, భారతి పేరుమీదుండే సరస్వతీ ప్రార్థననూ, వందేమాతరమ్‌నూ ఉచ్చరించకూడదు. వేరు మతాల విద్యాలయాల్లో వారి ప్రార్థన చేసుకోవచ్చు, కాని హిందూ మత విద్యాలయాల్లో ప్రార్థనకు ఆంక్షలెక్కువ. దేశీయత పనికి రాదు, దేశ వస్తువులు పనికిరావు. మరి కొందరికి భృతి దొరకనందున 'క్విట్ ఇండియా' అంటూ వారంతటవారు దేశం వదలి విదేశాలకు పోతున్నారు.

స్వాతంత్ర్యానికి పూర్వం మనం పూర్ణమనస్సుతో విదేశస్థులను మన దేశం వదలి పొమ్మని ఉద్యమాల్ని లేవదీశాం. ఇపుడే ఉద్యమమూ చేపట్టకుండానే మన దేశాన్ని మనవాళ్లే విడిచిపెట్టి వెడ్తున్నారు.

అయితే, వారు అమెరికాలో ఉన్ననూ, ఆస్ట్రేలియాలో ఉన్ననూ, ఆఫ్రికాలో ఉన్ననూ, వేటే దేశంలో ఉన్ననూ, తెలుగు గడ్డమీద, తెలుగు భాషమీదా మమకారం చంపుకోవడం లేదు. ఏ దేశంలో తెలుగు సభలు జరిగిననూ, విదేశాంధ్రులే ఎక్కువగా వస్తున్నారు. ఎపుడో విడిచి వెళ్లిన వారి గ్రామాలపై, ప్రజలపై మక్కువను చూపిస్తున్నారు. కొందరు తమ గ్రామాభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తున్నారు. అయితే తెలుగును చదవనూ, వ్రాయడంలో వారు శ్రద్ధను వహించకపోవడం బాధగా ఉంది. క్రైస్తవమత ప్రచారంలా, మన భాషాభివృద్ధికీ, సంస్కృతీ పరిరక్షణకూ, మనం ఉద్యమించాల్సిన అవసరం కనిపిస్తున్నది. ఇలా అనడం కూడా ఇపుడు పునరుక్తి దోషంగా పరిణమిస్తున్నది. ఒక్కొక్కప్పుడు మాతృభాషను నేర్చుకోవయ్ అనో, అమ్మా మీ అబ్బాయికి తెలుగు నేర్పమ్మా - అనో, కటువుగా చెప్పాల్సివస్తోంది. ఈ తరం తల్లులు తమ సంతతికి తెలుగు చదవనూ, వ్రాయనూ, మాట్లాడడం నేర్పకపోతే, వచ్చే తరానికి 'తెలుగు' అనేదొక భాష ఉందనీ, అది సంస్కృతీ సంపదల నిలయమనీ గ్రహించే భాగ్యం మనకు ఉండదు. తమనంతగా తీర్చిదిద్దిన 'తెలుగు'ను మరిస్తే, భరతమాత సహించదు. ఆ తల్లి ఒడిలో పెరిగిన మీరు 'డాడీ ఏడీ', 'మమ్మీ డుమ్మీ' అంటూంటే దేశద్రోహం, మాతృద్రోహమవుతుంది. అలాగాకుండా ఉండాలని 'శ్రీరామరక్షతు - వెయ్యేళ్ల ఆయుష్షః' అంటూ మంగళ పదములు పలుకుచున్నాను. విదేశాలలో నున్నవారిని స్వామి వివేకానంద వలె మన దేశ ఔన్నత్యాన్ని చాటగోరుచున్నాను. మీరు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకుంటున్నాను. విజయోస్తు.




బుధజన విధేయుడు

- గోటేటి శ్రీరామారావు

*శ్రీ కాట్రగడ్డ ప్రసాద్ గారి కోరికే కాదు, చాలామంది కోరిక ఎడిటోరియల్ పేజీ నాన్నగారిదే వుండాలి. ఆయన 24 సంవత్సరాలుగా రాసినది తిరిగి ప్రచురించండి అన్నారు. ఆ సలహాను పాటిస్తూ...*

Founder Editor : **GOTETI SRI RAMA RAO**, Editor : **GOTETI VENKATESWARA RAO**
Printed, Published & Owned by **G.V.RAO**, Associate Editor
at **GOTETI GRAPHICS**, 16 (64), Thambiah Reddy Road, West Mambalam, Chennai - 33.
Phone : 91-44-24742091, 91-44-23716322, 91-44-24894145 - Tele Fax : 91-44-23716322
**www.pramukhandhra.org/E.mail : pramukhandhra95@gmail.com**
**YEARLY SUBSCRIPTION : RS. 216/- PROMOTERS SUBSCRIPTION : RS. 2116/-**



# బ్రహ్మాండ నాయకుడు విశ్వవ్యాపక దేవుడు
# శ్రీవేంకటేశ్వరుడు!

ఆ దేవుని కాళ్లు కడిగి ఆ చతుర్ముఖ బ్రహ్మ కడిగిన పాదమని నుతించె అన్నమయ్య.

ఏడుకొండలపై వెలిసి ఏడేడు లోకాల ఏలికై
అష్టాదశ వర్ణాల కాపుగున్నాడు
ఇలవేల్పుగ వెలసిన ఇష్టదైవమండీ–
ఏ కష్టము జరిగినా ఏ నష్టము జరిగినా
ఏ అరిష్టము వచ్చినా ఆదుకొనేవాడు
ఆపద మొక్కులవాడు ఆపద్బాంధవుడీ
వేంకటేశుడండీ– విశ్వవ్యాపక దేవుడండీ!

–మేమంటున్నది కాదు, అఖిల విశ్వమే అంటుంది. విశ్వమంతటా గుడులు కట్టి గుడులనే తమ హృదయ వడులుగా చేసుకుని తరింపచేస్తున్న ఒకే ఒక నాధుడు వేంకటనాథుడు. ఏడు పడగల శేషుడు మోస్తున్నాడంటారు. మప్ఫైరెండు వేల కృతులం జేసి అన్నమయ్య మోకరిల్లా డంటారు. పాదములను మోపకుండా మోకాటిపై రామా నుజులవారు కొండలనధిరోహించాడంటారు. ముమ్మూ ర్తుల దేవుళ్లు, ముక్కోటి దేవతలు, కోటానుకోట్ల జీవరాశుల దృశ్యాదృశ్యంగా కొలుస్తున్నారంటారు. కలియుగ వైకుంఠ మిదియే నంటారు. అనడమే కాదు, వినడమే కాదు, అవనిలో ఇంతటి దేవదేవుడే లేదండి! కొలువైన కోనేటి రాయుడండీ– వారు వీరని గాక ఎవ్వరు ప్రార్థించినా, అరమరికలు లేకుండా ఆదుకునే అలిమేలు మంగా నాధుడండీ! పొందిన అష్టైశ్వర్యములన్నిటినీ హృదయము కంది ఇచ్చువాడండీ! ఆ వేంకటరమణుడు సామాన్యుడా, ఎంత భక్తజనరంజకుడు, ఎందరి ఆపదల మ్రొక్కువాడు. ఇహ ఊరేగే మలయప్పస్వామి తన ఇరువురి నాంచారు లతో ఎన్నెన్ని రూపాలు, అవతారాలు. మూలవిరాట్స్వామి, స్వయంభువుడైన శ్రీవేంకటేశ్వరుడెన్నెన్ని ఆభరణాలు ధరిస్తాడండీ!– ఆకాశరాజు, సాళువ నరసింహుడు, కృష్ణరాయుల్నుంచీ ఎందరెందరు సార్వభౌములు ఎన్నెన్ని ఆభరణాలు చేయించారండీ– లోకంలో ఏ దేవునికైనా ఇంతటి సిరిసంపద లున్నాయా? సిరులను మూటగట్టు కున్నారా? ఆయన మూటగట్టుకుని, తానొక్కడే అనుభ వించకుండా, అనేకానేక మందికి మూటలు మూటలుగా ఇస్తున్నాడు. వారినుంచీ మూటలు మూటలుగా ధన, కనక, రత్న రాశుల్ని ఆర్ద్రభక్తితో పొందుతున్నారు. ఇలాటి దేవుడు ఇహలోకమందు ఎక్కడా లేడండీ! అందుకే విదేశస్థులు సహితమూ– వేంకటేశ్వరా, కరుణా సాగరా– ఎక్కడున్నావయ్యా అంటూ వస్తున్నారు. భక్త వరదా! వేంకటేశ్వరా! నిరుపమ కరుణాభరణా! అనుగ్రహించవయ్యా ఏడుకొండల వేంకటయ్యా!

**సమస్త సన్మంగళానిభవన్తు!**

"PURNA VIDYANIDHI"
KUPPA VENKATA KRISHNA MURTHY
Editor BHAKTIMALA
Vidyadhikari
AVADHOOTA DATTA PEETHAM

SRI GANAPATHY SACHCHIDANANDA ASHRAM
Datta Nagar, Ooty Road, Mysore - 570025
Cell: +91 9866330060
email: kvkm49@gmail.com


## ఆత్మీయతామూర్తి

మాన్యశ్రీ గోటేటి శ్రీరామారావు గారు కీర్తిశేషులయ్యారని ప్రముఖాంధ్ర డిసెంబరు, 2018 పత్రికలో చూసీ చూడటంతోనే, నేను నిశ్చేష్టుణ్ణి అయిపోయాను. ఆయన నామీద గత 16 యేళ్ళుగా కురిపిస్తూ వస్తున్న ఆత్మీయతావర్షం, మరోసారి నన్ను తడిపి ముద్ద చేసింది. వారి సార్థక జీవితపు నిడివితో గానీ, అఖండమైన సరస్వతీప్రవాహంతో గానీ, బహురంగ విస్తీర్ణమైన అనుభవపరిపాకంతో గానీ, పోల్చి చూస్తే, 16 యేళ్ళ పరిచయం పొట్టిదే అయినా, నేను సంస్థను స్థాపించిన దగ్గరనుంచీ వారు అయాచితంగా అందించిన ప్రోత్సాహామృతం నాకు ఎప్పటికప్పుడు నూతన చ్యవనప్రాశగా బలసత్త్వాలను అందించింది. వేదాలలోని వైజ్ఞానిక శాఖల పరిశోధన శ్రీగోటేటి వారికి ఎంతో ఎంతో ప్రియమైనది. వారిని హైదరాబాద్‌లోనూ, చెన్నైలోనూ, నేను కలిశినప్పుడల్లా, మా ఇద్దరి మధ్యా గంటలకు గంటలు, నిమిషాల లాగా, దొర్లిపోతూ వుండేవి. వారి విజ్ఞానపరిణతికి నేను ఆశ్చర్యచకితుణ్ణి అవుతూ వుండేవాణ్ణి. అలాంటి శ్రీరామారావు గారు ఇక లేరంటే, జీర్ణించుకోవడం కష్టంగా వుంది. అయినప్పటికీ, వార కుమారుడు శ్రీ వెంకటేశ్వరరావు గారి ద్వారా చిరంజీవిగా నిలబడబోతున్న ప్రముఖాంధ్ర పత్రిక శ్రీగోటేటి వారి ఆత్మీయతామూర్తిని పాఠకుల ఎదుట శాశ్వతంగా నిలబెడుతుందని నేను విశ్వసిస్తున్నాను. శ్రీ వెంకటేశ్వరరావుగారిలోకి శ్రీరామారావుగారు పరకాయప్రవేశం చేసి, చిరంజీవిగా నిలవాలని, ఆదిగురు దత్తాత్రేయస్వామి వారిని ప్రార్థిస్తున్నాను.

**జయగురుదత్త**

మైసూరు
09.01.2019

**కుప్పా వేంకట కృష్ణమూర్తి**
విద్యాధికారి, అవధూత దత్తపీఠం



# జగద్గురు శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ మహాస్వామివారి అనుగ్రహ సందేశములో అనేక విషయాలు తెలియజేశారు

ప్రతిమనిషి తన జీవితంలో ఒక ఆదర్శవ్యక్తిని అనుసరించవలయును. ఆ ఆదర్శ వ్యక్తి శ్రీరామచంద్రుడు. శ్రీరాముడు అనుసరించిన న్యాయ, ధర్మమార్గములను మనము జీవితమునందు అలవరచుకోవాలి అన్న తీర్మానమును తీసుకొనవలయును. శ్రీమద్రామాయణమునందు శ్రీరామచంద్రుని 'గుణవాన్ ధర్మజ్ఞఃచారిత్రేణ యుక్తః సర్వభూతేషు హితః విద్వాన్, సమర్థః, ఆత్మవాన్, జితక్రోధః అనసూయకః' మున్నుగా వర్ణించారు. అనగా శ్రీరామచంద్రుడు సద్గుణ సంపన్నుడు, ధర్మమును తెలిసినవాడు, సత్ప్రవర్తన కలిగినవాడు, కోపమును జయించినవాడు, అసూయ లేనటువంటివాడు. ఈ గుణములు శ్రీరామచంద్రుని యందు సంపూర్ణముగా నున్నట్లు శ్రీమద్రామాయణము తెలుపుచున్నది. మనము శ్రీరామచంద్రునివలె జీవితమును గడపవలయునన్నచో ఈ గుణములను మన నిత్య జీవితమునందు అలవరచుకొనవలయును. రామావతారము యొక్క ప్రధానోద్దేశ్యము మానవజన్మయందు సర్వాత్మనా ధర్మాచరణము సాధ్యము అని నిరూపించుటయే. ధర్మమును గురించి చెప్పుట సులభము కాని ఆచరించుట కష్టము అని చాలామంది భావన. శ్రీరామచంద్రుని చరిత్రను పరికించినచో ఇటువంటి భావనకు అవకాశమే లేదు. ఏదో ఒక విధముగా మన జీవితమునందు అభివృద్ధికి రావలయును అన్న భావన సరికాదు. ధర్మ మార్గమును అనుసరించి అభివృద్ధికి వచ్చుటయే సరియైనది. రావణాసురుడు మొదలైనవారు అధర్మమార్గమును అనుసరించి అభివృద్ధికి వచ్చిననూ చివరకు పతనము చెందిరి. ధర్మమార్గమును అనుసరించిన శ్రీరామచంద్రుడు ఎన్ని కష్టములు అనుభవించిననూ చివరకు జయమునే పొందెను. ఈ న్యాయము, అన్యాయము అనునవి ప్రాచీన కాలమునకు మాత్రమే సంబంధించినవి కావు. ఇవి సార్వకాలికములు. వీటిని మనము అలవరచుకొన్నచో మనకే కాదు, మనము నివసించుచున్న సమాజమునకు కూడా మంచిది. ధర్మాచరణమును విడుచుట వలనే ప్రస్తుత కాలములో భూకంపము, సునామి మొదలగు ప్రకృతి వికోపములు ఎక్కువగా వచ్చుచున్నవి. అధర్మాచరణము తక్కువైనచో ప్రకృతి వికోపములు తగ్గును. దానికి మనము భగవదనుగ్రహమును పొందవలయును. శాస్త్ర ప్రకారము ఒకే పరమాత్మ మనలను అనుగ్రహించుటకు అనేక రూపములను ధరించినాడు. మనకు ఇష్టమైనటువంటి రూపమును ఉపాసించి భగవదనుగ్రహమును పొందవచ్చును. ప్రతియొక్కరూ ఈ సత్యమును గ్రహించి భగవదనుగ్రహపాత్రులై అధర్మపరాఙ్ముఖులై శ్రీరామచంద్రుని ఆదర్శముగనుంచుకొని ధర్మమార్గ పరాయణులై శ్రేయోవంతులగుదురు గాక. **(శ్రీశంకర కృప సౌజన్యం)**

# మహాభినిష్క్రమణం...

**– కరణం కళ్యాణ్ కృష్ణ కుమార్,** విజయవాడ

ఓ మహావృక్షం నేలకొరిగింది ..
అక్షర వర్షం అకస్మాత్తుగా వెలిసింది..
పరుచుకున్న ఆ మట్టి సుగంధాలు విశ్వ వ్యాపితమవుతూనే ఉన్నాయ్..

నిజం..
నలుచెరుగుల విస్తరించి భాషకు బాసట నిలచిన తరువు సేదదీరింది..

అక్షరాలకు వెలుగులద్ది.. తెలుగు బావుటా దిగంతాలెగురేసిన తేజో
సుందరరూపం కాసింత ప్రశాంతతను కోరుకుంది..

దశాబ్దాల కాలం తమిళ దేశాన ఆంధ్రుల సత్తువ చాటిన ప్రముఖాంధ్రుని
గొంతు మూగవోయింది..

కదిలే బొమ్మల పట్టి, కాగితాన నిలబెట్టిన కళాకోవిదుడి కలం సడిచేయక
నిలిచిపోయింది.

సంపాదన కోరని సంపాదకీయం నరనరాన జీర్ణించుకున్న విద్యా విశారద
వాచకం రెక్కలు కట్టుకు వెళ్ళిపోయింది..

ఆఖరి శ్వాస వరకూ నమ్ముకున్న వ్యాసాంగాన్ని వాడివేడిగా అక్షరబద్ధం
చేసిన అవిరళకృషీవలుడి ఆయువు అడుగులు వేసుకుంటూ
నిష్క్రమించింది..



జన్మతహ అంటి పెట్టుకున్న వినయం
కర్మతహ వంట పట్టించుకున్న విషయం..
బాటగ పరిచిన ఆస్తిక భీష్మా..

మీ మార్గం ఆచరణీయం..
మీ భావం నిరుపమానం..
మీ అక్షరం రామతూణీరం
మీ పాండిత్యం మేరునగం..
మిమ్ము దర్శించుకోలేకపోవటం..
నను వెంటాడే ఓ చేదు జ్ఞాపకం...!!

**ప్రముఖాంధ్ర సంపాదకులు..గురుతుల్యులు.**
**శ్రీ గోటేటి శ్రీరామారావు గారి స్మృతిలో..**



# తెలుగు భాషకు ఆకాశమే హద్దు

మనిషి పుట్టినప్పటి నుంచి ఆ సమాజానికి చెందిన భాషకు, అతడికి మాతా శిశు సంబంధం ఏర్పడుతుంది. హృదయస్పందన, బుద్ధి వైభవాన్ని వెల్లడిస్తుంది భాష. అది మనుషుల మధ్య సామాజిక బాంధవ్యాన్ని నెలకొల్పుతుంది. సాంస్కృతిక పునాదిగా వెలుగొందుతుంది. భిన్నత్వంలో ఏకత్వం సంతరించుకున్న సంస్కృతి మనది. భాష సహకారంతోనే ఇది పరిణామం చెందుతుంది. యుగయుగాలుగా క్రమానుగతమైన చరిత్ర, సంస్కృతి,సంప్రదాయం, భాషరూపంలోనే తరువాతి తరాలకు అందుతాయి. ప్రతి భాషా ఓ సాంస్కృతిక పుష్టిని, విలక్షణత్వాన్ని కలిగి ఉంటుంది. పరిజ్ఞాన ఆర్జనలో భాష వినిమయంలో మాధ్యమంగా వ్యవహరించేదే భాష.

## సమన్వయంలో మేటి

విశిష్టత, శ్రుతి మాధుర్యాన్ని బట్టి తెలుగు భాషను 'ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' అని వర్ణించాడు సీపీ బ్రౌన్. ప్రొఫెసర్ హాల్డేన్– తెలుగుకు అత్యంత సమన్వయ శక్తి, భిన్న స్రవంతుల్ని తనలో లీనం చేసుకునే సామర్థ్యం ఉందని ప్రస్తుతించారు. 'క్రీడాభిరామం' కావ్యకర్త 'దేశభాషలందు తెలుగు లెస్స' అని మొదట పేర్కొంటే, అనంతరం అది కృష్ణదేవరాయల మాటగా జనబాహుళ్యంలో ప్రచారమైంది. సంగీతానికి అనువైన చక్కని అజంత భాష తెలుగు, పోర్చుగీసువారు దీన్ని 'జెంతూ' అని వ్యవహరించేవారు. 'దేశీయ మైన' అని ఆ పదానికి అర్థం. తెలుగు భాష దక్షిణాదిన జన వ్యవహారంలో విస్తృతంగా ఉన్నదని వారు గుర్తించారు. కర్ణాటక సంగీతానికి తెలుగువారి గొప్ప కానుక ఈ భాష. తమిళుడు, సంస్కృత పండితుడు అయిన అప్పయదీక్షితులు ఆంధ్రత్వం, ఆంధ్రభాష ఎంతో తపఃఫలం వల్ల కానీ కలగవని శ్లాఘించారు. తమిళుల జాతీయ కవి సుబ్రహ్మణ్య భారతి 'సుందర తెలుంగు' అని ప్రశంసించారు.

## జనజీవన గీతిక

తెలుగు భాష ప్రాచీన ప్రతిపత్తికి ఏర్పడిన అవరోధాలు తొలగిపోయాయి. ఈ జాతి పురాతనం, ఈ నేల ఇతిహాస మయం. ఋగ్వేదంలోని ఐతరేయ బ్రాహ్మణంలో 'ఆంధ్ర' పదం జాతిపరంగా మొదట ప్రయుక్తమైంది. భరతుడి నాట్య శాస్త్రంలోనూ భాషపరంగా 'ఆంధ్ర' ప్రసక్తి ఉంది. నాటి అమరావతి స్తూపం మీద ఉన్న 'నాగబు'ను తొలి తెలుగు పదంగా పండిత పరిశోధకులు భావించారు. ఇటీవల విశాఖ జిల్లా యలమంచిలి సమీపంలోని కొత్తూరు గ్రామం వద్ద క్రీస్తు పూర్వం నాటి ప్రాకృత శాసనం లభించింది. అందులో 'తమ్మయ దానం' అనే తెలుగు మాట ఉంది. క్రీస్తు శకం నాటి హాలుడి 'గాథాసప్తశతి'లో తెలుగు మాటలున్నాయి. నన్నయకవి సువ్యవస్థితమైన భాషలో కావ్యరచన చేశాడంటే, అప్పటికి కొన్ని శతాబ్దాలకు ముందే తెలుగు భాష జన వ్యవహారంలో ఉండేదని భావించవచ్చు. జాతికి జీవన నాలిక– జానపద గీతిక, ఆధునికంగా పరిశోధకులు సేకరిస్తున్న జానపద వాఙ్మయం అతి ప్రాచీనమైనది. సామాన్యుడి నాలుకపై నర్తించిన తెలుగు భాష, ఒకనాడు పాటల రూపంలోఉండేది.

ఆంగ్లం రావడమే జ్ఞానం, హిందీ నేర్చుకోవడమే జాతీయత అనే అభిప్రాయాలు సమాజంలో బలంగా పాతుకుపోతున్నాయి. పై స్థాయికి ఎదగడం ఆంగ్ల భాషవల్లనే సాధ్యపడుతుందన్న భావం బాగా వ్యాప్తిలో ఉంది. దీనికి కారణం వివిధ స్థాయిల్లో అవకాశాల్ని ఆంగ్ల భాషా సామర్థ్యం బట్టి నిర్ణయించడమే! దీనివల్ల విద్యార్థులు మాతృభాషలో కృషి చేయలేని స్థితిలో ఉన్నారు. సామర్థ్యం సాధించలేకపోతున్నారు. భాషాగతమైన సామర్థ్యం లేకపోతే, వ్యక్తి విషయ గ్రహణంలోనూ వెనుకనే ఉండిపోతాడు. జటిలమైన విషయం ఓ అవగాహనలోకి వచ్చే ప్రక్రియలో, అనుకోకుండానే అది మాతృభాషాపరమై ఆలోచనలో స్థిరపడుతుంది. సాధన మాత్రమైన స్థాయిని దాటి, ఆత్మీయతా భావనతో పెనవేసుకుపోయి, మానవుడి మూర్తిమత్వంలో అవిభాజ్య అంశంగా భాష రూపొందుతుంది.

ఐరోపా దేశాలు భాషా దేశాలని చెప్పవచ్చు. నార్వే, స్వీడన్, ఫిన్‌లాండ్, డెన్మార్క్, జర్మనీ, బెల్జియం వంటి దేశాల్లో చాలా వరకు మాతభాషలోనే విద్యాబోధన జరుగుతుంది. రష్యా, చైనా దేశాల్లో మాతృభాషలో విద్యాబోధన జరుగుతుండగానే, మరో భాషను మాధ్యమిక స్థాయిలో, ఇంకో భాషను ఆపై స్థాయిల్లోనూ నేర్పుతున్నారు.

దేశానికి స్వాతంత్ర్యం ఎటువంటిదో ప్రజలకు భాషా స్వాతంత్ర్యమూ అటువంటిదే. స్వాతంత్ర్యాన్ని దుర్వినియోగం చేయడం ఎంత అనుచితమో, భాషా స్వాతంత్ర్యాన్ని దురుపయోగం, నిరుపయోగం చేయడమూ అంతే అనుచితం.

ఈ సందర్భంలో మనం గిడుగును స్మరించాలి. భాష కోసం నిర్దుష్టత, సమగ్రత, హేతుబద్ధతతో చేసిన కృషి ఆయనను తెలుగులో మొట్టమొదటి ఆధునిక భాషా శాస్త్రవేత్తగా నిలిపింది. కాలానుగుణంగా భాష మారుతుంటుంది. దాన్ని బట్టి వ్యాకరణలూ మార్చాల్సిన అవసరం ఉంది. సమకాలీనంగా ఉన్న భాషను రచనల్లోకి గ్రహించాలనే అభిప్రాయంతో, ఆయన వ్యావహారిక భాషా ప్రచారం సాగించారు. విశ్వనాథ సత్యనారాయణ 'మన భాషలో ఇద్దరే వాగనుశాసనులు. నన్నయ భట్టు, గిడుగురామమూర్తి' అని ప్రకటించడం ఈ సందర్భంగా గమనార్హం.

## మాతృభాష పరిరక్షణలో

ఏ దేశంలోనైనా వ్యవసాయాభివృద్ధి, పరిశ్రమలు, కాలుష్య నివారణ వంటి అంశాలపై ఉద్యమాలు జరుగుతాయి. తెలుగు రాష్ట్రాల్లో తల్లిభాష పరిరక్షణకు ఉద్యమాలు సాగించాల్సిన పరిస్థితి కలిగింది. బ్రిటిషు సామ్రాజ్యమైనా కోల్పవడానికి సిద్ధపడతారేమోగాని, షేక్స్‌పియర్‌ను వదులుకోవడానికి సిద్ధంగా లేమని ఒక సందర్భంలో అప్పటి బ్రిటిష్ ప్రధాని చర్చిల్ అన్నారు. భాషా స్ఫూర్తి, సాంస్కృతిక చైతన్యం అంటే అదీ!

ప్రాచీన భాషా ప్రతిపత్తి వల్ల కొందరు రచయితలకు భాషావేత్తలకు మేలు జరగవచ్చు. ప్రోత్సాహకాలు లభించవచ్చు. కానీ, భాషను జన వ్యవహారంలో నిలిపే దారేదీ? బ్రిటిష్ భాషావేత్త డేవిడ్ క్రిస్టల్ 'విశ్వభాష (గ్లోబల్ లాంగ్వేజ్)గా విస్తరిస్తున్న ఆంగ్ల ప్రభావం వల్ల ఈ శతాబ్దంలో కొన్ని వందల భాషలు కనుమరుగవుతున్నాయి. దీన్ని ఎలక్ట్రానిక్ విప్లవం మరింత వేగవంతం చేస్తుంది' అన్నారు. ఆంగ్లానికి ప్రాధాన్యం లేకుండానే చైనా, రష్యా, జపాన్ వంటి దేశాలు అభివృద్ధి పథంలో దూసుకెళ్లాయి. తమిళనాడు, మహారాష్ట్రల్లో అన్ని స్థాయిల్లోనూ మాతృభాషనే ఉపయోగిస్తున్నారు. మన భాష, మన సంస్కృతి అనే భావం, మార్పు తెలుగువారిలో రావాలి. పుట్టిన శిశువుకు తల్లి స్తన్యం ఎంత జీవనాధారమో, ప్రాథమిక విద్యలో మాతృభాష అంతే, పాలనపరంగా చట్టాలు, పత్రాలు, నివేదికలు, న్యాయస్థానాల తీర్పులు సరళమైన తెలుగులో వెలువడేలా ప్రభుత్వం ప్రయత్నించాలి. తెలుగును రక్షించుకోవడమంటే 'ఏ తెలుగు' అనే ప్రశ్న కొందరికి రావచ్చు. పలుకబడి, మాండలికం ఏదైనా తెలుగు తెలుగే. భాషన ఎలా పరిరక్షించుకోవాలన్నదే మనకు ముఖ్యం. మన జాతి జెండా తెలుగు దాన్ని సగర్వంగా ఎగరనిద్దాం.

– డాక్టర్ దామెర్ల వేంటక సూర్యారావు
(విశ్రాంత తెలుగు శాఖాధిపతి, బీవీకే కళాశాల, విశాఖ)

# యువకులకు వివేకానందుని పిలుపు



యువకులారా! నా ఆశలన్నీ మీపైనే ఉన్నాయి. మీ జాతి పిలుపుకు మీరు స్పందిస్తారా? నా మాటను విశ్వసించే సాహసం మీకు ఉంటే మీలో ప్రతి ఒక్కరికీ ఉజ్జ్వలమైన భవిష్యత్తు ఉంది. బాల్యంలో నా పట్ల నాకు ఎలాంటి విశ్వాసం ఉండినదో అట్టి అఖండ విశ్వాసం మీ పట్ల మీకు ఉండాలి. మీలో ప్రతి ఒక్కరూ అలాంటి ఆత్మవిశ్వాసం కలిగి ఉండండి. ప్రతి ఆత్మలోనూ నిక్షిప్తమై ఉన్న ఆ అనంతశక్తిచే మీరు యావద్భారత దేశాన్ని పునరుజ్జీవింప చేయగలరు. ఆహా! అప్పుడు మనం ఆకాశం క్రిద ఉన్న దేశాలన్నింటిలోకి చొచ్చుకొని పోతాం. అచిరకాలంలోనే ప్రపంచంలోని ప్రతి జాతిని నిర్మిస్తూ ఉన్న అనేక శక్తులలో మన భావ సముదాయం కూడా ఒక ముఖ్యాంశమైపోతుంది. భారతదేశంలోనూ, విదేశాలలోనూ ప్రతి జాతీయ జీవనంలోనూ మనం అంతర్లీనం కావాలి. దీని సాదనకై మనం ఉద్యమింపవలసి ఉంది. ఈ కార్యనిర్వహణలో నాకు యువకులు కావలసి యున్నారు.

ద్రఢిష్టుడు, బలిష్టుడు, కుశాగ్రబుద్ధి ఐన యువకుడే పరమ్మాతను చేరగలడని వేదాలు పేర్కొంటున్నాయి. మీ భవిష్యత్తును నిర్ణయించుకోవాలసిన సమయం ఇదే. స్వచ్ఛమై ఉజ్జ్వలమై పొంగారు యువశక్తి మీలో ఉన్నప్పుడే మీ భవిష్యత్తును మీరు నిర్ణయించుకోవాలి. జవసత్వాలు ఉడిగిన పిదప కాదు. లేవండి! సమయం ఇదే. మీరు హైందవులు ఆత్మ శాశ్వతమనే విశ్వాసం స్వాభావికంగా మీలోఉంది. ఒక్కొక్కప్పుడు కొందరు యువకులు నా వద్దకు వచ్చి నాస్తికవాదం గురించి మాట్లాడతారు. హైందవుడు నాస్తికుడు కాగలడనటం నేను విశ్వసించను. అతడు పాశ్చాత్య గ్రంథాలు పఠించవచ్చు. తాను చార్వాకుడనని నచ్చచెప్పుకోవచ్చు. కాని అది తాత్కాలికమే. అది మీ రక్తంలో లేదు. మీ స్వభావంలో లేని విషయం మీరు విశ్వసించలేరు. అది మీకు అలవి మాలిన కార్యం. అలాటి పనికై ఎన్నడూ ప్రయత్నించకండి. నా బాల్యంలో నేనొకసారి ఆ ప్రయత్నం చేశాను. విఫలుడనైనాను. మన శాస్త్రాలు వచిస్తూ ఉన్నట్లు 'సాదు పరిత్రాణానికై యుగయుగాలలో అవతరించే ఆ ప్రభువు' ఆ శ్రీకృష్ణపరమాత్మ మనలను ఆశీర్వదించి మన లక్ష్యసిద్ధి కేసి మనల నందరినీ కొనిపోతాడు గాక.

యువకులారా! లేవండి! మేల్కొండి. ఇదే సరైన తరుణం. ధీరులుకండి. భీతిల్లకండి. ఒక్కమారు శాస్త్రాలలోనే భగవంతుని 'అభీః' అనే విశేషం ప్రయుక్తమైంది. మనం నిర్భీతులం కావాలి. అప్పుడే మన ఉద్యమం సఫలీకృతమవుతుంది. లేవండి. మేల్కొండి, మీ దేశానికి యీ మహత్తర త్యాగం అవసరమై ఉంది. యువకులే దీన్ని నిర్వహించగలరు. శక్తిపూరితులు, బలిష్టులు, కండలు తేరినవారు, విద్యావంతులు ఐన యువకులకే ఈ మహాత్కార్యం నిర్దిష్టమై ఉంది. అట్టి వందలాది మంది యువకులు మనకు ఉన్నారు. లేవండి, మేల్కొండి ఈ ప్రపంచం మిమ్మల్ని ఎలుగెత్తి పిలుస్తూ ఉంది. ఉత్సాహ సంభరితులై లేవండి. పేదలమని, నిస్సహాయులమని మీరు తలంచనే వద్దు. ఏమిటి? ధనం ఎక్కడన్నా మనుష్యులను తయారు చేసినట్లు చూసి ఉన్నారా? ఎల్లడలా మానవుడే ధనాన్ని ఉత్పత్తి చేస్తున్నాడు. మానవ తేజం చేతనే, ఉత్సాహ శక్తిచేతనే, విశ్వాసబలం చేతనే ఈ యావత్ప్రపంచం నిర్మితమైనది.


నా బిడ్డలారా! నేను మీవద్దకు వచ్చింది నా ప్రణాళికలను మీకు తెలుపటానికే. వాటిని ఆలకిస్తే మీతో కలిసి పనిచేయటానికి నేను సంసిద్ధంగా ఉన్నాను. కాని మీరు నా మాటను పెడచెవిన పెట్టి, నన్ను భారత దేశం నుండి గెంటివేసినా సరే, నేను తిరిగి వచ్చి మన మందరమూ మునిగిపోతున్నామని చెబుతాను. మీ మధ్య కూర్చోటానికే ఇప్పుడు వచ్చాను. ఒక వేళ మనం మునుగవలసి ఉంటే అందరం కలిసే మునిగిపోదాం. కాని మన నోట చీత్కారాలు రాకుండు గాక!

మన దేశపు ఆధ్యాత్మిక, లౌకిక విధానాలపై మన పట్టు ఉండి తీరాలి. మీకిది అవగతమౌతోందా? దీన్నే మీరు కలవరించాలి, పలవరించాలి. యోచించాలి. సాధించి తీరాలి. అంతవరకు ఈ జాతికి ముక్తి లేదు. మీరు నేర్చుకొంటున్న విద్యలో కొన్ని మంచి విషయాలు ఉన్నవి. కాని దాన్లో ఎంత మహానర్థం ఉందంటే అది ఈ మంచి విషయాలన్నిటిని తుడిచి పారేస్తుంది. మొట్టమొదట అది ధీరులను చేసే విద్య కాదు. అది కేవలం పూర్తిగా వ్యతిరేకార్థమైన విద్య. వ్యతిరేకార్థమైన విద్యయైనా, వ్యతిరేకతపై ఆధారపడిన ఎట్టి శిక్షణయైనా మరణం కంటే నికృష్టం. పిల్లవాడు పాఠశాలలో చేరటమే ఆలస్యం అతడు మొట్టమొదట నేర్చుకొనే పాఠం తన తండ్రి మూర్ఖుడని, రెండవ పాఠం తన తాత పిచ్చివాడని, మూడవపాఠం తన గురువులందరూ నయవంచకులని, నాలుగవ పాఠం తన మతగ్రంథాలన్నీ పుక్కిటి పురాణాలని, పదహారేళ్లు వచ్చేసరికి అతడు నిరాకరణాల రాశియై, నిర్జీవుడై శల్యమాత్రావశిష్టుడై మిగులుతున్నాడు.

మీ మెదడులో చొప్పించబడి, మీచే గ్రహింపబడక యావజ్జీవిత పర్యంతం మిమ్మల్ని కలవరపెడుతూ ఉండే విషయ సముపార్జన విద్య కాదు. మనకు కావలసింది చైతన్యవంతులుగా ఒనరించేవీ, ధీరులుగా రూపొందించేవీ, శీలాన్ని తీర్చిదిద్దేవీ అయిన భావాలు. ఆ భావాలను మీరు జీర్ణించుకొని వాటిని మీ జీవితంగా, శీలంగాచేసుకొనే పక్షంలో ఒక పెద్ద గ్రంథాలయాన్ని కంఠస్థం చేసిన వ్యక్తి కంటే ఎక్కువ విద్యగా పరిగణించే పక్షంలో గ్రంథాలయాలే మహా యోగులు. విజ్ఞాన సర్వస్వాలే ఋషులు అవుతాయి. కాబట్టి మన ఆదర్శం ఏమిటంటే, మన దేశంలోని లౌకిక ఆధ్యాత్మిక విద్యావిధానం యావత్తు మన ఆధీనంలో ఉండాలి; సాధ్యమైనంతవరకూ అది జాతీయ విధానాలతో ఉండాలి. జాతి జీవన స్రవంతిని ప్రతిబింబిస్తూ జాతీయ పద్ధతులపై కొనసాగాలి.

(రామకృష్ణమఠం వారి ప్రచురణల నుండి)

**ప్రతి సంవత్సరం జనవరి 12ను యువజన దినోత్సవంగా జరుపుకుంటున్నాం. కాని యువతను ఉద్దేశించి వివేకానందుడు ఇచ్చిన పిలుపును ఎంతమంది ఆచరించారు. యువత మీద ఎన్నో ఆశలు పెట్టుకున్న వివేకానందుని ఆశయాన్ని నిరాశపరచడం భావ్యం కాదు.**



# 'గణ'నీయుడు కాల్యంపూడి రాధాకృష్ణారావు

**ఆయన నాకు ప్రత్యక్షంగా తెలియదు. 2010 సం॥ నవంబర్ 14 వ తేదీ ఆంధ్రజ్యోతి అనుబంధ సంచిక చూడగానే సంక్షిప్తంగా ముచ్చటించాలనిపించింది. చదవండి! నాతోపాటు ఆనందాన్ని పంచుకోండి. -ఎడిటర్**

2010 అక్టోబర్ 19, హైదరాబాద్...

హైటెక్‌సిటీ సమీపంలోని అధునాతన అంతర్జాతీయ సమావేశమందిరం. ప్రతిష్ఠాత్మకమైన థర్డ్ వరల్డ్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ మహాసభల ప్రారంభోత్సవ వేడుకలతో అది సందడిగా ఉంది. ప్రధాని ముఖ్య అతిథిగా వచ్చిన ఆ సభలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి రోశయ్య, గవర్నర్ నరసింహన్, కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రిత్వశాఖ సహాయ మంత్రి పృథ్వీరాజ్ చవాన్ వేదికపై ఆసీనులై ఉన్నారు. 50 దేశాలకు చెందిన 350 మంది విజ్ఞాన శాస్త్రవేత్తలు హాజరైన సభ అది. శాస్త్ర విజ్ఞాన ప్రపంచంలో సంచలనాలు సృష్టించిన శాస్త్రవేత్తలకు ప్రధాని మన్మోహన్‌సింగ్ చేతులు మీదుగా అవార్డులను అందజేస్తున్నారు. ఒక్కో శాస్త్రవేత్త వేదికమీదకు వెళ్లినప్పుడల్లా... కరతాళ ధ్వనులతో సభామందిరం ప్రతిధ్వనిస్తున్నది. వరసగా పిలుస్తున్న పేర్ల మధ్య చిన్న అంతరాయం..

ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మాధవన్ నాయర్ హఠాత్తుగా మైక్ ముందుకు వచ్చి, గణితం, గణాంకశాస్త్రాల్లో అంతర్జాతీయ ఖ్యాతి గడించిన ప్రముఖ శాస్త్రవేత్త సి.ఆర్ రావు ప్రతిష్ఠాత్మకమైన ఇండియా సైన్స్ అవార్డును అందుకోనున్నట్టుగా ప్రకటించారు. సభలో ఒక్కసారిగా కలకలం. అంతలోనే హర్షధ్వానాల వెల్లువ. 90 ఏళ్ల ముదిమిలోనూ ఏ మాత్రం పట్టు సడలని దారుఢ్యంతో ఆ వృద్ధశాస్త్రవేత్త అవార్డు స్వీకరించడానికి లేచి వెళుతుంటే చప్పట్లు ఆగలేదు. కళ్లలో పరిపూర్ణమైన గౌరవం తొణికిసలాడుతుండగా ప్రధాని స్వయంగా రెండడుగులు ముందుకు వచ్చి అవార్డును అందజేశారు.

ప్రత్యేకత ఏంటీ? అంత గొప్పవారా ఎప్పుడూ వినలేదే? అనుకుంటారేమో!

ఆయన అంకెల మాంత్రికుడు. గణాంకశాస్త్ర స్రష్ట. అంకెలను మంత్రాస్త్రాలుగా ప్రయోగించి జెనెటిక్స్, ఆంత్రోపాలజీ, మెడిసిన్, స్పేస్.. వగైరా అనేక శాస్త్రాల్లో కొత్త ఆవిష్కరణలకు అంకురార్పణ చేసిన ద్రష్ట. సిఆర్ రావుగా ప్రపంచ ప్రసిద్ధుడైన కాల్యంపూడి రాధాకృష్ణరావు పేరు శాస్త్ర ప్రపంచంలో తెలిసినంతగా సాధారణ జనానికి తెలియదు. దాదాపు మూడు దశాబ్దాలుగా ఆయన అమెరికాలో ఉండటం దీనికి ఒక కారణమైతే, సినిమాస్టార్స్‌కు రాజకీయ నాయకులకు లభించే ప్రచారం ఎంత గొప్పవారైనా సరే అన్యులకు మన మీడియాలో లభించకపోవడం మరో కారణం కావచ్చు.

1910 సెప్టెంబర్ 10న అప్పటి అవిభక్త మద్రాస్ రాష్ట్రంలోని హువిన్న హడగళ్లిలో (ప్రస్తుతం కర్ణాటకలో ఉంది) జన్మించిన సిఆర్ రావు తల్లితండ్రులకు ఎనిమిదో సంతానం. వాళ్ల మొత్తం పదిమంది పిల్లలు. తండ్రి దొరైస్వామినాయుడు పోలీసు అధికారి. తల్లి లక్ష్మీకాంతమ్మ అష్టమ సంతానం కావడం వల్ల కృష్ణుని









పేరు పెట్టారని రావు నవ్వుతూ చెబుతారు. సంపన్న వెలమదొరల కుటుంబం. నిజానికి ఆ రోజుల్లో భూస్వామ్య కుటుంబాల్లో చదువు, డిగ్రీలు, ఉద్యోగాలకు అంత ప్రాధాన్యం ఉండేది కాదు. కానీ, దొరైస్వామినాయుడు పిల్లల చదువు విషయంలో ప్రత్యేక శ్రద్ధతో ఉండేవారు. నందిగామ, నూజివీడు వంటి ప్రాంతాలన్నీ తిరిగి విశాఖపట్నంలో స్థిరపడేనాటికి ఆయన పదవీవిరమణ చేశారు. రావు ఏకసంథాగ్రాహి అని ఆయన ముందే గమనించారు. అందుకే గణితంపై ప్రత్యేక శ్రద్ధపెట్టేలా ప్రోత్సహించేవారని రావు చెబుతారు. చిన్నప్పుడు తండ్రి ప్రేమతో కొనిచ్చిన లీలావతి గణితం...లెక్కలపై ఆయన మక్కువను మరింత పెంచింది.

సౌమ్యంగా, బక్కపల్చగా, ఒక మోస్తరు ఎత్తుతో 'చెరగని చిరునవ్వు, కళ్లజోడు వెనక మెరిసే కళ్లు.. స్థూలంగా ఇదీ రావుగారి రూపం. విశాఖపట్నం బడిలో టీచరుకు తానేమిటో చాటిన నాటి నుంచి హైదరాబాద్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఇండియా సైన్స్ అవార్డును అందుకున్నవరకు 80 ఏళ్ళ ప్రస్థానంలో ఆయన ఎన్నడూ అలసిపోలేదు.

నీకెప్పటికీ తెలుగురాదు... పో అంటున్నాడా తెలుగు మాస్టారు. వ్యాకరణంలో ఒక ప్రశ్నకు జవాబు చెప్పనందుకు ఆగ్రహంతో అరుస్తున్న మాస్టారు ఎదుట పదుకొండేళ్ల ఆ పసివాడు నిరుత్తరుడై నిల్చుని ఉన్నాడు. విశాఖపట్నంలోని ఒక ప్రభుత్వ పాఠశాలలో కొత్తగా వచ్చి చేరిన ఆ బాలునికి నిజానికి ఆ సబ్జెక్ట్ పూర్తిగా కొత్త. మాస్టారు మాటలకు సిగ్గుతో, అవమానంతో విద్యార్థి మొహం కందిపోయింది. అదే సమయంలో తెలియని కసి, పట్టుదల కళ్ళలో కదలాడింది. స్కూల్ విడుస్తూనే వెళ్లి తెలుగు వ్యాకరణం పుస్తకం కొనుక్కున్నాడు. రాత్రంతా వ్యాకరణ సూత్రాలు పట్టుదలగా బట్టీపట్టాడు. తెల్లవారి స్కూలుకు వెళుతూనే మాస్టారు దగ్గరకు వెళ్ళి వ్యాకరణంలోంచి ఏ ప్రశ్నైనా అడగమని అభ్యర్థించాడు. ఆశ్చర్యపోయిన టీచర్ మొదటిగా ఒక ప్రశ్న అడిగాడు. ఠకీమని సమాధానం వచ్చింది. రెండో ప్రశ్న... మూడో ప్రశ్న ఆ తెలుగు పండితుని మొహంలో తెలియని దిగ్భ్రాంతి. తన ఎదుట ఉన్న కుర్రాడు సామాన్యుడు కాదు. ఆ విద్యార్థి పేరు కాల్యంపూడి రాధాకృష్ణరావు.

# కాశీపట్టణం తెలుగుతనరహితమనిపించదు కాశీలో తారక బ్రహ్మేంద్రాశ్రమం ఉన్నది




తెలుగుదేశం నుంచీ వచ్చు యాత్రికులకు ఉచిత భోజన సౌకర్యాలు కూరుస్తున్నది. కరివెనవారి సత్రం మూడుపూటలా ఉచిత భోజన, అల్పాహారాలను పెడుతున్నది.

చాలామంది హిందువులు తమ పెద్దల అస్థికలను నిమజ్జనానికి పితృదేవతలకు తర్పణం వదలడానికి కాశీ వెడుతుంటారు. ఒక్క మన రాష్ట్రం నుంచి వెళ్ళేవాళ్ళను లెక్కగట్టినా ఓ లక్షమంది ఏటా ఈ పనిమీద కాశీ వెళ్ళి వస్తుంటారు. అలా వెళ్ళే వాళ్ళకు అక్కడ ఎలాంటి ఏర్పాట్లు ఉన్నాయో, అలాగే పక్కనున్న గయకు కూడా వెళ్ళి ఎందుకు పిండప్రదానం చేస్తారో తెలియజేయడానికే ఈ వ్యాసం.

మన పెద్దలు పేర్కొన్న ఏడు పవిత్ర నగరాల్లో కాశీ ఒకటి. మా ఇంటిల్లి పాదీ.. అంటే ఓ పన్నెండు మందిమి మా పెద్దల అపరకర్మల కోసం ఇటీవల కాశీ వెళ్ళొచ్చాం. అక్కడ అడుగడుగునా ఓ దేవాలయం. దానికి కాస్తా అటో ఇటో ఓ స్నానఘట్టం కనిపించాయి. గంగానది ఒడ్డున దాదాపు వంద స్నానఘట్టాలున్నట్టు చెప్తారు.

కాశీలో ప్రతి క్షణం ఎక్కడో ఒక చోట ఏదో ఒక శవదహనం జరుగుతూనే ఉంటుంది. అస్థికల నిమజ్జన కార్యక్రమాలు సాగుతూనే ఉంటాయి. పితృదేవతల పేరిట పిండప్రదానాలు కోకొల్లలుగా కొనసాగుతూనే వుంటాయి. హిందూ సంప్రదాయం ప్రకారం సూర్యాస్తమయం తర్వాత శవదహనం చేయరు. కాని కాశీ నగరం దానికి మినహాయింపు. అర్ధరాత్రయినా అంత్యక్రియలు చెయ్యొచ్చు. ఎలాగూ కాశీలో చనిపోయినవాడు పుణ్య లోకాలకేపోతాడు కనుక ఏ వేళలో కాల్చినా ఫరవాలేదనుకుంటారేమో.

కాశీ పవిత్ర నగరమే కాని పరిశుభ్రంగా మాత్రం ఉండదు. ఈ మాట స్థానిక పురోహితుల వారితో అంటే 'అయ్యా కాశీ క్షేత్రం ఒక మహారుద్ర భూమి. అంటే శ్మశానవాటిక. అక్కడ పరిశుభ్రతంటే ఎలా కుదురుతుందని జవాబిచ్చారు. నిజమే... తెల్లవారుఝాము నుంచి మధ్యాహ్నం వరకు అస్థికల నిమజ్జనం కోసం వివిధ ప్రాంతాల నుంచి వచ్చినవారితో అక్కడి స్నానఘాట్‌లు ఎంత క్రిక్కిరిసి వుంటాయో చెప్పలేం. కాని ప్రస్తుతం కొంత శుభ్రంగా వుందని చెబుతున్నారు.

ఏడాదికి సుమారు కోటి మంది దేశం నలుమూలల నుండి తమ పెద్దల అస్థికల నిమజ్జనానికై ఇక్కడకు వస్తుంటారని స్థానిక తెలుగు పురోహితులు రాజవరపు కేదారనాథ్ శాస్త్రి చెప్పారు. ఆయన కరీంనగర్ జిల్లా మంథనికి చెందిన బ్రాహ్మణుడు. వారి అన్న రాజవరపు విశ్వనాథశాస్త్రితో కలిసి ఆయన తెలుగువారికి, ఇతర దక్షిణాదివారికి ఈ పౌరోహిత్య సేవలు అందిస్తుంటారు. తులసీ సుబ్రహ్మణ్య జోషి పెద్దరికంలోని మరో తెలుగు పురోహిత కుటుంబం కూడా అక్కడ పేరుగాంచినదే. వీరిద్దరి అజమాయిషీలో మన రాష్ట్రం నుండి వెళ్లిన చాలామంది కుర్ర బ్రాహ్మణ పురోహితులు పనిచేస్తుంటారు. తరతరాలుగా అక్కడే స్థిరపడ్డ తెలుగు సాంప్రదాయ పురోహితులు ఇంకా చాలామందే ఉన్నారు.

శివరాత్రి పండుగరోజుల్లో, మే, జూన్ నెలల్లో మళ్ళీ కార్తిక మాసంలో తెలుగు వాళ్లు ఎక్కువగా కాశీకి వస్తారని కేదారనాథ్ శాస్త్రి చెప్పారు. ప్రాయశ్చిత్తం, పిండ ప్రదానం, అస్థిక నిమజ్జనం, నెలవారీ మాసికాలు, సంవత్సరీకాలు... మైల పని ఇలా పలు శ్రాద్ధకర్మల కోసం అన్ని కులాలవారూ కాశీకి వస్తారని చెప్పారాయన. మన తెలుగు పురోహితులు అస్థిక నిమజ్జన తంతు నిర్వహించడమే కాక, వెళ్ళినవారికి తగిన వసతి, భోజన ఏర్పాట్లు కూడా చేసిపెడుతున్నారు.

మా పన్నెండు మందిమి ఉదయం 10 గంటలకు రైలు దిగగానే స్నానాలు ముగించుకొని నేరుగా విశ్వనాథశాస్త్రి పండితుల వారింటికి వెళ్లాం. కర్మకాండలన్నీ శాస్త్రోక్తంగా తృప్తిగా మాచేత చేయించారు. మా పన్నెండు మందికీ మాసికం పెట్టిన ముగ్గురు బ్రాహ్మణులకు కూడా వండి వడ్డించారు. ఆశ్చర్యం వేసింది. హైదరాబాద్‌లో ఎందరో తెలిసినవారి మధ్యన కూడా ఇంత సానుకూలంగా అన్నివేళలా జరగదనిపించింది.

సొంత ఊరిలో మాదిరిగా అన్ని సౌకర్యాలు కల్పించారే అంటే, తాము మూడు తరలా నుంచి కాశీలో ఉంటున్నామన్నారు. తమ ముత్తాత సేనావధానులు శాస్త్రి మొదట మంథని నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడ్డారని, ఇప్పటికీ ఏడాదికి ఒక పర్యాయం మంథని వెళ్తుంటామని చెప్పారు. అలా స్వరాష్ట్రానికి వచ్చినపుడు ఏడుకొండలవాడిని దర్శించుకుంటామని తెలిపారు. తాము చేసే కర్మకాండలకు ఒక ఫిక్స్‌డ్ రేట్ ఏమీ లేదని, ఎవరి శక్త్యానుసారం ఎంత ఇచ్చినా తీసుకుంటున్నామని అన్నారు.

కాశీలో అన్ని వర్గాల వారికి అనుకూలమైన వసతి సౌకర్యాలున్నాయి. స్టార్ హోటళ్ళకూ కొదవలేదు. మాకు అమితానందం కలిగించిన మరో విషయమేమంటే, కాశీ క్షేత్ర సమీపంలోని కరివెనవారి సత్రం. ఈ సత్రం విశాలమైన రెండతస్తుల భవనంలో ఉంది. వీరైతే తెలుగువారి భోజనం, కమ్మని నెయ్యి, స్వీటుతో సహా పగటిపూట లంచ్, అలాగే రాత్రిళ్లు ఏదైనా ఒక టిఫిన్ చేసి, వేడివేడిగా, ఉచితంగా మనవారందరికీ అందజేస్తున్నారు. కాశీ అన్న పూర్ణమ్మ సేవలో భాగంగా భావిస్తూ ఎంత ధనికుల్నుంచి కూడా ఏ మాత్రం డబ్బు వసూలు చేయరు. ఆశ్చర్యం వేసినా... ఇది నిజం.. సత్రం నిర్వహణకు మాత్రం విరాళాల రూపంలో సేకరిస్తారు.





# బహుముఖ ప్రజ్ఞాశాలి భానుమతి

**1925** సెప్టెంబర్ 7 న ఒంగోలులో జన్మించిన భానుమతి 1939లో 'వర విక్రయం' సినిమా ద్వారా నటిగా వెండితెర రంగప్రవేశం చేశారు. 1943లో 'కృష్ణప్రేమ' సినిమాలో నటిస్తుండగా ఆ చిత్రానికి అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న రామకృష్ణను ప్రేమించి పెళ్ళి చేసుకున్నారు. 1946లో ప్రముఖ దర్శకుడు బి.ఎన్.రెడ్డి తెరకెక్కించిన 'స్వర్గసీమ' చిత్రంలో ఆమె నటన, దర్శకత్వం రెండూ పోటాపోటీగా సాగాయి. ఈ చిత్రంలోని 'ఓహో... ఓహో... పావురమా' అనే పాట ఆమె చిరునామా అయిందని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. 1947లో తన కుమారుడు పేరిట భరణీ పిక్చర్స్ ప్రారంభించి తొలి ప్రయత్నంగా తన భర్త రామకృష్ణ దర్శకత్వంలో 'రత్నమాల' చిత్రాన్ని నిర్మించారు. 1953లో దర్శకురాలిగా మారి ఒకేసారి తెలుగు, తమిళ, హిందీ భాషల్లో 'చండీరాణి' చిత్రాన్ని తెరకెక్కిస్తూ స్వీయనిర్మాణంలో రూపొందించారు. అంతేకాకుండా టైటిల్‌రోల్‌ని ఆమె పోషించడం కూడా అప్పట్లో ఒక సంచలనం. ఆమె ఎంత గొప్ప నటో అంత గొప్ప గాయని కూడా. 'కోతి బావకు పెళ్ళంట..' 'ప్రేమే నేరమౌనా' టో బాటసారి నను మరువకోయి...' 'శ్రీకర కరుణాలవాలా వేణుగోపాలా' అంటూ సాగే ఈ పాటలు ఆమె స్వరం నుంచి జాలువారి నేటికీ అజరామరంగా నిలిచాయి. తన అరవై ఐదు సంవత్సరాల సినీ జీవితంలో భానుమతి అందుకున్న గౌరవాలు అవార్డులు అనేకం.

ఒక విలక్షణమైన మనస్తత్వం, వింతైన ఆలోచనాధోరణి, రాళ్లను సైతం కరిగించే స్వరం ఆమె సొంతం. అశ్లీలతకు ఆమె ఎంతో దూరం కాబట్టి ఎట్టి పరిస్థితులలోనూ తన ఆత్మాభిమానానికి భంగం కలుగని రీతిలో నడిచిన భానుమతి కారణజన్మురాలు.

ఆమె సుందర, సుకుమార, సుమధుర, సహర్వాహ, సుగాత్రి, రచయిత్రి, కవయిత్రి, కళాభినేత్రి, తెలుగు సరస్వతి, వెండితెరకు వెలలేని బహుమతి భానుమతి-అన్నారు వేటూరు సుందరరామమూర్తి. భానుమతిగారి జననము, మరణము అనే రెండు తీరాలమధ్య ఆమె పడవ ప్రయాణంలోని మధురిమలు. సంగీతం, సాహిత్యం, నృత్యం, నటన, దర్శకత్వం ఈ పంచకల్యాణిలలో దేనిమీద ఎక్కువ మక్కువ అని అడిగితే నీకు ఏ కన్నంటే ఇష్టము అన్నట్లే ఉంటుంది.

పద్యరచనలోనో, గద్యరచనలోనో లేదా ఒక నటి/ నటుడుగానో తమంతవారు లేరని అహంభావ భూషణలున్న ఆ కాలంనుంచి నేటివరకు 'స్వాభిమానము' వున్న సకల కళాప్రపూర్ణ భానుమతి నిక్కచ్చి తత్వాన్ని అహంభావం అనటము హాస్యాస్పదం. పురుషాధిక్యమే మన సమాజములో ఎక్కువ. అందునా సినిమా పరిశ్రమలో నరనరాన నిండిన పురుషాధిక్యత, కుల తత్వం, ధనఅహంకారము విచ్చలవిడిగా ఏలుతున్న 1939-1970 కాలంలో పదమూడో ఏట సినీరంగ ప్రవేశము చేసిన బాల భానుమతి ధీరగా నిలబడింది. నట చక్రవర్తులను, నటసామ్రాట్టులైన ఎంజి రామచంద్రన్, ఎన్టీఆర్, శివాజీగణేశన్ వంటి నటులతో సమ ఉజ్జీగా నిలువగలిగింది. నటిగా ఆమె తారస్థాయికి చేరటం, ధన వర్షం కురియడము, ప్రొడక్షన్ వ్యవస్థను, స్టూడియోను స్థాపించటము, ఆమె సోపానపటపు నిచ్చెన ఎక్కుతూనే వచ్చింది.

ఒంగోలు వంటి చిన్న ఊరిలో పేదకుటుంబంలో చిన్ని ఆడపిల్ల 70 ఏళ్ల క్రితమే ఆత్మవిశ్వాసం ఉంటే ఆత్మగౌరవంతో ఆకాశమంత ఎత్తుకు ఎదగవచ్చు అని నిరూపించిన మహిళారత్నము భానుమతి. పద్మభూషణ్ 2003లో ఆమె సిగలోనొక తురాయి అయ్యింది. మల్లీశ్వరిగా ఆమె నటన, దానితో పోటీపడుతూ పాడిన గానామృతం రెంటినీ నేటికీ ఈ తరంవారు కూడా ఆస్వాదిస్తున్నారు.

వరవిక్రయంతో మొదలిడిన సినీ ప్రస్థానము. పెళ్ళికానుకతో ముగిసింది. చిత్రమైన విషయము మొదటి, చివరి రెండూ వివాహానికి సంబంధించిన పేర్లు కావడం. భానుమతిగారు తన గళాన్ని తన భూమికలకే కాక చాలామందికి కూడా ఇచ్చేవారు. బొబ్బిలియుద్ధంలోని 'శ్రీకర కరుణాలవాల వేణుగోపాల' అన్న పాటను, ఉదయం విష్ణాలయాలలో మైకులలో పెట్టని గుడులు, వినని తెలుగువారు లేరంటే అతిశయోక్తి కాదు. ఇంక భానుమతిగారి వంటల కన్నా అత్తగారి కథలు తలచుకుంటే నవ్వనివారు వుండరు. వారి ఛలోక్తులు, చురకలు రుచిచూడని సినీరంగ ప్రముఖులు లేరని ఘంటాపథంగా చెప్పవచ్చు.

అష్టావధాని అన్న పిలుపుకు ఆమె చక్కగా సరితూగగల గొప్ప కళా తపస్వి. రచయిత్రిగా, నాట్యగత్తెగా, సంగీత సామ్రాజ్ఞిగా, నటిగా, దర్శకురాలిగా, నిర్మాతగా, ఎడిటర్‌గా, భరణి అధినేతగా ఆమె నిర్వహణ అష్టావధానం కాక మరియేమని చెప్పాలి? అవధానము అన్న పదము కూడా తక్కువేమో!

విద్యావేత్త, మన భారతదేశపు మొదటి ఉప రాష్ట్రపతి డాక్టర్ రాధాకృష్ణన్ గారు భానుమతమ్మకు గొప్ప అభిమాని. లలిత కళా అకాడమీ, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ సభ్యురాలిగా, తమిళనాడు ప్రభుత్వ మ్యూజిక్ కాలేజీ డైరెక్టర్‌గా కూడా భానుమతి రామకృష్ణ పనిచేశారు. అందరి మన్ననలను పొందారు. ఒక సంఘ సేవికని కూడా ఆమెలో మనము ప్రస్ఫుటంగా చూడగలము. మద్రాసు నగరంలో మెట్రిక్యులేషన్ స్కూల్ సాలిగ్రామంలో స్థాపించి ఆర్థికంగా వెనుబడిన వారికి విద్యను ప్రసాదించిన కరుణామయి. 1964లో పద్మశ్రీ, 1985లో రఘుపతి వెంకయ్య అవార్డు, 2001లో పద్మభూషణ్ పురస్కారాల గ్రహీత పురస్కారాలెన్నో వున్నాయి. ముక్కు సూటిదనం, చిక్కులలో పడేసినా కూడా చిక్కకుండా తన ఇమేజ్‌ని, స్వాభిమానాన్ని తాకట్టుపెట్టని గొప్ప ఆదర్శ స్త్రీ రత్నము పద్మభూషణ్ భానుమతి రామకృష్ణ. భానుమతిగారి తుది శ్వాస విడిచిన రోజు డిసెంబర్ 24, 2005 ఘననివాళి అర్పిస్తూ **సంధ్య గోళ్లమూడి.**

*Lovely Stay at Holy Tirupathi* *The Gateway of Lord Balaji*

**HOTEL MAYURA**

**204, 209, T.P. Area, Tirupati - 517 501 (A.P.)**
**(Opposite Bus Station)**
**Phone : 0877-2225925, 2225251, Fax : 0877-2225911**
**e-mail : mayurahotels@yahoo.co.in, Grams :**

**గోపురం**



## పరమార్థ కథలు
## శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశనందగిరి స్వాముల వారు
# తారక విద్య




పూర్వమొకానొక పండితుడు సర్వవిద్యా పారంగతుడు పాదచారియై యాత్ర చేసికొనుచూ పోవుచుండెను. దారిలో నొకచోట నది ఒకటి అడ్డము రాగా దానిని దాటవలసి వచ్చెను. నదిలో నీరు వెల్లువలుగ ప్రవహించుచుండెను. ఒడ్డున ఒక బెస్తవాడు చిన్నపడవ నొకదానిని ఉంచుకొని యుండుట జూచి ఆ పండితుడు వానితో సంభాషించి ఆవలి యొడ్డునకు పోవుటకు ఏర్పాటు చేసికొనెనను. ఇరువురును తెప్పలోనికి ఎక్కిరి. బెస్తవాడు పడవను నడుపుచుండెను. పండితుడు నావలో కూర్చుని దీర్ఘాలోచన తత్పరుడై యుండెను. ఏమి ఊహ జనించినదో కాని ఆకస్మాత్తుగా నాతడు ఆ పల్లెవానిని పిలిచి 'ఓయీ తర్క విద్య నీవేమైనా అభ్యసించి నావా?' అని అడిగెను. బెస్తవాడు పడవను నడుపుచునే 'లేద'ని జవాబిచ్చెను. అటుపిమ్మట వారిరువురి మధ్య ఈ క్రింది సంభాషణము నడచెను.

పండితుడు: ఛీ, ఛీ. తర్కవిద్య నేర్వని జీవితము జీవితమేనా? అట్టి అపూర్వ విద్యను నేర్చుకోనందువలన నీ జీవితములోని పాతిక భాగము వ్యర్థమైపోయిందని నేను తలంచుచున్నాను. ఇప్పుడైనను నాబోటివారి దగ్గర నేర్చుకొని బాగుపడు! అయితే సరే కాని మీమాంస ఏమైన చదివినావా?

బెస్తవాడు : బాబు! మీమాంస సంగతి నాకు ఏమీ తెలియదు మా మాంసం సంగతి మాత్రము తెలుసును.

పం: ఓరి వెఱ్ఱివాడా! మీమాంస నేర్చుకొనని వాడెవడైనా ఉండునా? అది నేర్వనందువలన నీ జీవితములో ఇంకొక పాతిక భాగము వృథా అయినదని నేను భావించుచున్నాను. పోని జ్యోతిష్యము చదివినావా?

బెస్త : బాబూ అది అంతకంటెను నాచేత కాదు

పం : నారాయణ! నారాయణ! జీవితములో ఇంకొక పాతికభాగము నాశనము చేసికొనినావురా వెఱ్ఱివాడా! తర్క మీమాంస, జ్యోతి ష్యములను మూడు శాస్త్రములను తెలియనివాడు ముప్పాతిక జీవితము దండుగ జేసికొనినట్లే యని గ్రహింపుము!

ఈ ప్రకారము వారిరువురి మధ్య సంభాషణము జరుగుచుండ పడవ సరిగా నదీ మధ్య భాగమునకు జేరెను. నీటి ప్రవాహము చాలా వడిగా నుండెను. ఇంతలో పెనుగాలి వీవదొడగెను. తుఫాను చెలరేగెను. నదీజలము ఉత్తుంగతరంగ సంయుక్తమైన భీతిని గొలుపుచుండెను. పడవ తరంగముల తాకిడికి డోలాయామన మగుచుండెను. ఇంతలో పడవలోనికి నీరు ప్రవేశించెను. తత్ఫలితముగ పడవ నెమ్మదిగా మునుగజొచ్చెను. ఆ ఘోర విపత్సమయమున బెస్తవాడు పండితుని బిలిచి 'అయ్యా, బాబూ, తమకు ఈత విద్య వచ్చునా?' అయని అడుగుగా 'రాద'ని జవాబిచ్చెను. అది విని ఆ పల్లెవాడు 'మహాప్రభూ! తర్క మీమాంస జ్యోతిష్యములు చదువునందున నా జీవితములో ముప్పాతిక భాగము మాత్రమే నాశనమైనది. 'ఈతవిద్య' రానందువలన తమ జీవిత మిపుడు మొత్తము మొత్తముగానే (100%) నాశనమై పోయినది' అని పలికి యూడరకుండెను.

ఇంతలో పడవ మునిగిపోయెను. పండితుడు గంగార్పణ మయ్యెను. బెస్తవాడు ఈదుకుని ఒడ్డు చేరెను. చూచితిరి! నదీ ప్రవాహ మధ్యమున కావలసిన విద్య ఏది? ఈతవిద్య ఆ సమయమున తర్కముగాని, మీమాంసగాని, జ్యోతిష్యముగాని, హిస్టరీగానీ, జాగ్రఫీగానీ, ఆల్జీబ్రాగానీ, జ్యామెట్రీగాని ఏదియు జీవుని రక్షింపజాలదు. మునుగువానికి ఈత విద్య ఒక్కటియే శరణ్యము. అట్లే జీవుడు సంసార సాగర మధ్యమున గ్రుంకులిడుచున్నాడు. అట్టివానికి తరుణోపాయము బ్రహ్మవిద్యయే. అక్షర పరమాత్మతత్త్వమే. ఆ విద్య ఒక్కటియే జీవుని తరింపజేయగలదు. కనుకనే దానికి 'తారక విద్య' యని పేరు వచ్చినది. భవదుఃఖ శమనమునకై మనుజు డద్దానిని తప్పక పరిగ్రహించవలయును.

నీతి : నదిని దాటుటకు ఈత అవసరమైనట్లు సంసారమును దాటుటకు బ్రహ్మ విద్య అవసరము. కావున దానిని బడయుటకై జీవుడు ప్రయత్నించవలయును.

*నాన్నగారు శ్రీగోటేటి శ్రీరామారావుగారికి శ్రీశుకబ్రహ్మాశ్రమ వ్యవస్థాపకులు శ్రీశ్రీ విద్యా ప్రకాశానందగిరి స్వామివారన్నా, వారి శిష్యులు ప్రస్తుత పీఠాధిపతి శ్రీశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వామి వారన్నా ఎంతో గౌరవాభిమానా లున్నాయి. ఆయన నుండి నాకు అవి సంక్రమించి ప్రతి సంవత్సరం ఒకసారి ఆ ఆశ్రమంలో స్వామివారిని దర్శించుకుని వారి ఆశీస్సులు తీసుకోవడం తప్పనిసరిగా చేస్తున్నాను. ఇదివరలో (ప్రముఖాంధ్రలో) స్వామివారి గీతా మకరంధాన్ని దరిదాపుగా 15 సంవత్సరాలు ధారావాహికగా ప్రచురించాం. ప్రస్తుతం శ్రీశ్రీ విద్యాస్వరూపానంద స్వామి అనుమతితో ఈ పరమార్థ కథలు మీకు అందిస్తున్నాం. చదివి ఆనందించండి.* – గోటేటి వెంకటేశ్వరరావు

### నన్ను మెచ్చుకున్నారండోయ్...

తండ్రియాశయమును దీర్చు తపన తోడ
మాస పత్రిక "ప్రముఖాంధ్ర" కోసమీవు
నడుము గట్టియురికినావు వడివడిగను
చింత వలదు "గోటేటన్న" చేవ చూపు
శుభము గూర్చు నా "గణనాథు" డభయమిచ్చి

– పద్మజ మంత్రాల




We Provide your comfortable Stay and Tasty Food Hospitality

Bhimas Deluxe Hotel
(PROPRIETORS BHIMAS HOTELS LIMITED)
34-38, G.Car Street (Near Railway Station),
TIRUPATI - 517 501 (A.P.)
Phone : 0877-2225521, 6669199, Fax : 2225471
Website : www.bhimasdeluxehotels.com
E-mail : bhimasdeluxe@rediffmail.com

# జానపదము జనపదాల నుండే జనించినది!

జనపదాలంటే పల్లెలూ, గ్రామాలూ. పల్లెలూ, గ్రామాలనుంచే జానపదం జనించినది. ప్రాచీన భారత దేశంలో పల్లెలూ, గ్రామాలే ఎక్కువ. కల్లాకపటం లేని వారి నుంచే జానపదం పుట్టింది. అంటే అజ్ఞానాల్లోంచి జ్ఞానం పుట్టింది, జానపదం పుట్టింది. జానపదంలోనే జాణ తెలుగు ఉన్నది. జాణ తెలుగు లేదా జ్ఞాన తెలుగు అని కూడా అనవచ్చు. కల్తీలేని తెలుగు– అనడానికీ క్రింది జానపద గీతాన్నే చదవండి! చదవండి అనడం కన్నా అధ్యయనం చెయ్యండి అనడం సమంజసంగా ఉంటుందేమో!

**జాజిరీ జాజిరీ జాజిరీ పాపా**
**జాజూ లాడవే గాజుల పాపా!**
**తూరుపు నుండీ వచ్చెరా**
**తుప్ప తల నక్కా!**
**పడమటి నుండీ వచ్చెరా**
**పర్వతాల నక్కా..**
**ఆ నక్క ఈ నక్కా**
**తోడెరా బొక్కా** – అంటూనే పొడిగించిన ఈ గేయంలోని పొడమిరించిన పోటుతనాన్ని పరిశీలించండి!

**జోగయ్యనాకు కొన్ని జొన్న గింజలిచ్చె**
**ఏటి వొడ్డున సేద్యంబు చేస్తే**
**ఈడ్చి కొడితే ఇరవై పుట్లూ**
**ఆర్చి కొడితే అరవై పుట్లూ**
**అన్నీ కొలచబోయె అప్పయ్య దొరా**
**ఇసుకో ఉసుకో ఇద్దుమ వుంచే**
**తాడో తవుడో తవ్వెడు ఉండే–**
**మన్నో మైలోమానెడు వుండే!**
**ఉప్పులేని గంజీ తాగితిమయ్యా**
**చొప్ప కట్టెవోలె సోలీతీమయ్యా**
**కుక్కి మంచములో కూలీతిమయ్యా**
**జాజిరె జాజిరె పాపా!**

–అంటూ కొనసాగుతుంది. అంటే రెక్కాడొక్కా విరుచుకుని పంట పండిస్తే, అప్పులిచ్చిన షాహుకార్లు వచ్చి కష్టపడిన రైతుల కొంపలు తీయుట, నాగులకు అప్పులకూ, వడ్డీలకూ, కల్లములోని పంటను దొరలు లాగుకుని పోవుట, బీదరైతులు, వారి కూలీలు ఆకలితో కూలబడుట ఇదీ సారాంశం. వ్యవస్థల ఈ అవస్థలన్నిటినీ చక్కటి సులభ బాణీలో చిక్కటి వ్యవహారిక పదాలతో, తెలంగాణా జనపదంలో జానపదం పుట్టి, రైతుల పెదాలపై పల్లవించింది.

సాహిత్యం పెదాలపై సుస్నునితంగా జాలువారినపుడే జనపదాల్లో చిరకాలము చిగురు కొమ్మలా విరబూస్తుంది. అంతేగానీ కవిత్వ బాణీలో చందస్సులో బంధించామా అది ఛాందస్సుల నోట చప్పరింతకు గురియై చంపబడుతుంది.

భారతీయ సాహిత్యంలో జానపదం జనపదాల్లో జీవిస్తున్నదంటే అదే ప్రధాన కారణం. ఆంధ్రలోని ఆటవిక జాతుల్లో తెలంగాణా మారుమూల జనపదాల్లో ఆ భాష జీవించడానికదే కారణం.

నేను మద్రాసు వచ్చిన కొత్త రోజుల్లో ఆంధ్రానుంచీ కొండజాతుల వారు, ముఖ్యంగా కోయలు వచ్చేవారు. నా భార్య వారిని ఆదరించి, భోజనఫలహారములను పెట్టి, పాతచీరలనూ, వస్త్రాలనూ దుస్తులనూ యిచ్చేది. వాటినే వారు మహా ప్రసాదంగా పట్టుకుని వెళ్లేవారు. వాళ్ళు గృహస్థులను సంబరంపరిచే విధంగా, అరిచేతులను వెనకకు త్రిప్పి చెప్పమని, హస్తరేఖా విశేషాలను చెప్పేవారు. ఎందుకో వారిటీవల చెన్నయ్ రావడం లేదు.

కల్లాకపటం లెరుగనివారు వారొచ్చినప్పుడు మా శ్రీమతి మనసు పరమానందం పొందేది. కడుపునిండా వారికి భోజనం పెట్టేది. భోజన ఫలహారములు ఆరగించి, కాస్సేపు విశ్రమించి వెళ్ళేవారు. వారు అమాయకంగా శిరోజాలను ముడివేసుకుని, మోకాలిపై వరకూ పంచెగట్టుకుని, మెడలో పూసలహారాలు వేసుకుని సహజంగా గిరిజనులు ధరించే దుస్తులను వేసుకుని వచ్చేవారు. వారొస్తే మా ఇరుగింటి పొరుగింటి వారలు కూడా వచ్చేవారు. 'అక్కాయమ్మా! అంటూ వారు మాట్లాడే గిరిజన భాషలో అమాయకత ఉండేది, ఆత్మీయతా ఉండేది. ఇప్పుడు వారు రావడమూ తగ్గిపోయింది. వారి పిల్లలు, మనవలు వేషధారణ మారిపోయి, అలవాట్లు మారిపోయి భాష మారిపోయి మొత్తానికి మనుషులే మారిపోయారు.

**– గోటేటి శ్రీరామారావు**

గౌరవనీయులైన,

శ్రీ గోటేటి వెంకటేశ్వరరావు గార్కి ప్రముఖ ఆధ్యాత్మికవేత్త అన్నమయ్య గీతాంజలి ప్రధాన కార్యదర్శి

ఎం.వి.రాజశేఖర్ వారి నమస్కారములు.

మీ తండ్రి గారు ప్రముఖాంధ్ర తెలుగు మాస పత్రిక సంపాదకులు దివంగత గోటేటి శ్రీరామారావు గారితో నాకు విశాఖపట్నం శ్రీ మహాకామేశ్వరి పీఠాధిపతులు యద్దనపూడి అయ్యన్నపంతులు గారి ద్వారా పరిచయమైనారు. మీ తండ్రిగారు శ్రీ మహాకామేశ్వరి పీఠం వారు అందించిన తెలుగు సంవత్సరాది ఉగాది పురస్కారాన్ని అందుకునే నిమిత్తం విచ్చేసినారు.

2019 జనవరిలో నాకు డిసెంబర్ 2018కి చెందిన ప్రముఖాంధ్ర మాసపత్రిక మా ఇంటికి వచ్చింది. ప్రముఖాంధ్ర ముఖచిత్రంపై వారి ఫోటోను చూసినాను. తదుపరి లోపలకు వెళ్లి మరి కొన్ని ప్రతులు చూస్తుండగా వారు దివంగతులైనట్లు వారి పేరున మద్రాస్ మహా నగరంలో సంస్మరణ సభలు జరిగినట్లు చూసి నేను నివ్వెరపోయినాను. నిజంగా వారు కాలం చేశారా? అని నాకు అనిపించింది. ప్రముఖాంధ్ర మాసపత్రికను స్థాపించి 24 సంవత్సరాలకుపైగా అక్షరయజ్ఞం చేసిన వారి సేవలు శ్లాఘనీయము.

దివంగత గోటేటి శ్రీ రామారావు గారు అక్షరం ఉన్నంతకాలం చిర స్మరణీయులని నా అభిప్రాయం. ప్రముఖాంధ్ర పత్రికా సంపాదకులు గోటేటి శ్రీ రామారావుగారు కాలం చేశారన్న విషయాన్ని మాసపత్రిక ద్వారా తెలుసుకొని నేను చాలా విచారించాను. తమిళనాట తెలుగు అక్షరముల ద్వారా తెలుగు వాకిటను నెలకొల్పి ప్రముఖాంధ్ర తెలుగు మాసపత్రికను తెలుగు వారికోసం స్థాపించి తెలుగు అక్షరాల వైభవానికి తెలుగు భాషాభివృద్ధికి కృషి చేసిన ధన్యజీవి దివంగత శ్రీ గోటేటి శ్రీ రామారావు గారు. పత్రికా సంపాదకులుగా ఎన్నో విలువైన వ్యాసాలనందించి వ్యాసప్రపూర్ణులైనారు. ప్రముఖాంధ్ర ద్వారా మద్రాస్ మహానగరంలోనే కాకుండా యావత్తు ఆంధ్రప్రదేశ్‌లో ప్రముఖునిగా అక్షరాభిమానుల రచయితల హృదయాలలో 'చెరగనిముద్ర' వేసుకున్న దివంగత శ్రీ గోటేటి శ్రీ రామారావు గారి పవిత్రాత్మకు శాంతి చేకూరాలని ఆ వైకుంఠ వాసుని ప్రార్థిస్తూ వారి ఆశీస్సులను కోరుకొంటూ గడచిన కాల స్మృతులతో...

ప్రముఖాంధ్ర మాసపత్రిక బాధ్యతలను మీ హృదయానికి 'హత్తుకొని' ఎత్తుకున్న శ్రీ గోటేటి వెంకటేశ్వరరావు గారికి జ్ఞాన సరస్వతి అనుగ్రహించి ప్రముఖాంధ్ర మాసపత్రిక మరలా అందరికీ అందజేయడంలో మీ తండ్రి గారి ఆశీస్సులతో 'విధేయుని'గా తెలుగు అక్షరాభిమానుల హృదయాలలో 'అజేయుని'గా కలకాలం నిలవాలని శ్రీ గోటేటి వెంకటేశ్వరరావుని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి శుభాశీస్సులు కలగాలని కోరుకొంటూ...

శ్రీ గోటేటి శ్రీ రామారావు గారి అభిమాని

**ఎం.వి. రాజశేఖర్**

ప్రముఖ ఆధ్యాత్మికవేత్త మరియు అన్నమయ్య గీతాంజలి ప్రధాన కార్యదర్శి

# ఎనిమిది పదుల నాలుగు సంవత్సరముల అంచుకు చేరినప్పటికినీ ఏది సంపాదించాన్నదీ తెలియడం లేదు!

పత్రికా వ్యాసంగంలో 62 సంవత్సరముల నుంచీ కృషి చేస్తున్నాను. కానీ, ఇందు సఫలీకృతుడనయ్యానని అనుకోవడం లేదు. ప్రముఖాంధ్రను 23 సంవత్సరములుగా నిర్వహిస్తున్నాను. 2017 డిసెంబర్ నెల సంచికతో 23 సంవత్సరములు పూర్తియైనది. 2018 జనవరి నుంచీ 24 సంవత్సరంలో ప్రవేశించినది. ఎన్నో ఆటుపోటుల నెదుర్కొన్నది. మరి రెండు సంవత్సరాలు అనగా జనవరి 2019 నాటికి 25 వ సంవత్సరము ప్రవేశించనున్నది. రజతోత్సవ సంచికను వెలువరించాలనెడి సంకల్పం ఉన్నది. అప్పటికి నేనుంటానో ఉండనో తెలియదు కానీ మా పెద్దబ్బాయి వేంకటేశ్వరరావు రజితోత్సవ సంచికను వెలువరిస్తూ వేడుకను జరుపగలడనే విశ్వాసం ఉన్నది. ప్రపంచ తెలుగు ప్రజలను అలరించే తెలుగు మా(న)స పత్రికగా తీర్చిదిద్దగలిగితినే గానీ, ప్రపంచ తెలుగు ప్రముఖుల నుంచీ రవాణ ఖర్చులకైనా ప్రతిఫలం లభించడం లేదు. పది శాతం పాఠకులు అప్పుడప్పుడూ యధోచితంగా పంపిస్తున్నారు. అదే మహద్భాగ్యంగా తలంచుచున్నాను. నిరాశచెందడం లేదు. నిస్పృహకు లోనుకాలేదు. విదేశాల్లోని ప్రముఖాంధ్రులకు పంపే ప్రముఖాంధ్ర రవాణా ఖర్చుల నిమిత్తం ప్రతి ఒక్కింటికీ రూ.45/–లు చొ॥న ఖర్చవుతున్నది. అందు సగ భాగమైనా వారు పంపిస్తే కొంత చేదోడుగా ఉంటుంది.

తెలుగు జాతి ఔన్నత్యమూ, భాష ఔన్నత్యమునూ విశదపరుస్తూ ప్రముఖాంధ్ర నొండొరులను తెలియచేయడానికి కృషి చేస్తున్నాం. ప్రతిఫలము నాశించి నడుపడం లేదు. ఎందరో తెలుగు శ్రీమంతులు దేశవిదేశాల్లో ఉన్నారు. ఎప్పటికైనా వారు అందిస్తారనే 'ఆశ' ఉన్నది. వారందరికీ ప్రముఖాంధ్ర పత్రిక మూలంగా విన్నపమే తప్ప, ప్రత్యేకంగా ఉత్తరాలను వ్రాయడం లేదు. దైవాన్ని విశ్వసించే ప్రముఖాంధ్ర నడుస్తుంది. భవిష్యత్తులోనూ నడవగలదన్నదే నా విశ్వాసం

**– గోటేటి శ్రీరామారావు**

**నాన్నగారు టేబుల్ వెతుకుతూ వుంటే నాకు దొరికిన మేటర్ ఇది. ఆయన నామీద ఎంత నమ్మకం పెట్టుకున్నారోననిపించింది. అవును ఆసుపత్రిలో కూడా నీ మీద భారం పెడుతున్నానురా. రజతోత్సవం చేసి పత్రికను నిలిపివెయ్యి. అందరూ ప్రారంభోత్సవం చేస్తారు. మనం ముగింపోత్సవం చేద్దాం. ఇంతకన్నా నీ మీద భారం మోపడం భావ్యం కాదు అని అన్నారు. అలా అన్నారే కాని పత్రిక నిలిచిపోతుందేమోనన్న బాధ ఆయన కళ్ళలో కనిపించేది ఆయన చాలా పత్రికలు నడిపారు. అన్నీ వ్యాపారదృక్పథంతోనే ప్రతీ పత్రికా ఓ పది సంవత్సరాలు నడిచి తరువాత ఆగిపోయాయి. కాని చిత్రమేమిటో ఈ ప్రముఖాంధ్ర మాత్రం 24 సంవత్సరాలు పూర్తిచేసుకుని ఈ జనవరికి 25 వ సంవత్సరంలోకి అడుగుపెట్టింది. ఇది చాలామందికి చందా ఇచ్చినా, ఇవ్వకపోయినా వెడుతూంది.**

**ఈ పత్రికకు ఏ వ్యాపార ధోరణి లేదు. ఉన్నదంతా తెలుగువాడు, తెలుగుభాష, తెలుగు సంస్కృతి, మన సాంప్రదాయాలు, ఆధ్యాత్మికత అంతే. ఇలా 24 సంవత్సరాలు నడిచింది. ఇక ఎన్నాళ్లు వస్తుంది అంటే నా దగ్గర సరైన సమాధానం లేదు. కానీ ఈ మేటర్ ఆయన బల్లమీద చూసాక ఆయన నమ్మకాన్ని వమ్ము చేయడమా? ఎలా? ఏమిటి? నా వల్ల అవుతుందా ఈ ప్రశ్నలన్నింటికీ ప్రస్తుతం నా వద్ద జవాబు లేదు. కాని ప్రముఖాంధ్ర రావాలి అది పెద్దాయన కోరిక. వస్తుంది. అది నాముందున్న కర్తవ్యం. నాకు చేతనైన రీతిలో తీసుకురావటానికి నా శాయశక్తులా ప్రయత్నిస్తాను. ఆపై ఆ పరమాత్మ దయ. నాన్న ఆశీర్వాదం కావాలి. అది వుంటాయని నమ్ముతూ...**

**– గోటేటి వెంకటేశ్వరరావు)**



**ఆయనది ఒడిదుడుకుల జీవితం. ఎదురు దెబ్బలనన్నిటినీ ఎదుగుదలకు మెట్లుగానే ఉపయోగించుకున్నారు. అలాటివారు చాలా అరుదుగా వుంటారేమో. ఆయన పత్రికలు నడిపారు. సినిమాలకు ప్రెస్‌రిలేషన్‌గా పని చేశారు. సినిమాలు నిర్మించారు. ఒక ప్రెస్‌ను స్థాపించారు. ఇవన్నీ ఎవరి సపోర్ట్ లేకుండా, ఎవరితోనూ భాగస్వామ్యం చెయ్యకుండా, ఆయనగానే ఏర్పరచుకున్నవి. పిల్లల పత్రిక బాలరాజ్యం కొన్నాళ్లు, తరువాత మధురిమ, తరువాత మధురవాణి, తరువాత గోటేటి ఫిలిం డైరీ ఏకధాటిగా 25 ఏళ్ళపాటు, తరువాత సినీరమ (సినిమా పత్రిక) తెలుగు తమిళ భాషల్లో, తరువాత సినిమాలు ఇలా రకరకాల వ్యాపారాలు చేస్తూ ఆ కష్టనష్టాల్లోనే ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ వచ్చారు. చేసిన వ్యాపారాలు చాలా వరకు నష్టమే. పెద్ద సంపాదించినదేవీ లేదు, చిన్నగా సంపాదించి కూడబెట్టిన సొమ్ము పోగొట్టుకోడమే. అలా వ్యాపారాలు చేస్తూనే ఒక ఇల్లు, ఒక ప్రెస్‌ను సమకూర్చుకున్నారు. ఇదే ఆయన ఆస్తి. ముగ్గురు కొడుకులను చదివించి, వారిని స్థిరపరచడం, ఆ ముగ్గురిలో నేను ఆయనతోనే ఆ ఎగుడుదిగుడు బండిలో నేనూ ప్రయాణం చేశాను. గత 35 ఏళ్ళుగా ఆయనతోను, ఆయన వ్యాపారాలను చూస్తూ వుండిపోయాను. ఇలా అన్ని రకాల నష్టపోయిన కాలంలోనే ఆయన 'ప్రముఖాంధ్ర' ఉచిత పత్రికను ప్రారంభించారు. తెలుగు భాష, తెలుగువాడి గొప్పదనాన్ని ప్రపంచమంతా చాటి చెప్పడమే పత్రిక ఉద్దేశం. త్రికరణశుద్ధిగా చేశారు. ఆయన ఉద్దేశం గొప్పది కాబట్టి 24 ఏళ్లుగా పత్రిక నిరాటంకంగా వస్తూ వుంది. ఆ పత్రిక ద్వారా ఆయన దేశవిదేశాలన్నీ తిరిగి వచ్చారు. ఎన్నో బిరుదులు, సత్కారాలు పొందారు. ఆ పత్రిక ఆయనలోని మరో కోణాన్ని వెలుగులోకి తెచ్చింది. అదే ఆయనలోని ఆధ్యాత్మిక రచనాశక్తి. 'ప్రముఖాంధ్ర'లో తెలుగు భాష సొబగులు చెపుతూనే, మన సంస్కృతి సంప్రదాయాలను, దేశభక్తి ప్రబోధాలను తెలియపరుస్తూ ఉన్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే ఆయన రచించిన ఆధ్యాత్మిక వ్యాసాలు ఆయనకు మంచిపేరు తెచ్చిపెట్టాయి. ఆయన రచించిన రెండు పుస్తకాలు 'అధ్యాత్మ రామాయణం' 'శ్రీకృష్ణ' ఆయనలోని మరో కోణాన్ని చూపెట్టాయి. ఈ పుస్తకాలు రాస్తున్నప్పుడు ఆయన ఆరోగ్యం అంత బాగాలేదు. అయినా ఆయన పట్టుదల భగవద్భక్తి, ఆ భగవంతునిపై వున్న అచంచల విశ్వాసం, సంకల్పబలంతో పూర్తి చేశారు. శ్రీకృష్ణ పుస్తకానికొచ్చిన అడ్డంకులు ఇన్నీ అన్నీ కావు. అయినా భగవదనుగ్రహం వల్ల పూర్తి చెయ్యగలిగారు. ప్రముఖాంధ్ర ద్వారా ఆయన చేస్తున్న సేవను ఎందరో ప్రశంసించారు. ఎందరో పీఠాధిపతులు, స్వామీజీలు గుర్తించి ఆశీర్వదించారు. కానీ ప్రభుత్వం నుండి ఏ గుర్తింపు లేదు. భగవంతుడు, గురువులు, స్నేహితుల ఆశీర్వాద బలం, వారి అభిమానాలే ఆయనకు శ్రీరామరక్షగా వుండేవి. – గోటేటి వెంకటేశ్వరరావు**



# సంక్రాంతి పండుగ

సంక్రాంతి తెలుగువారందరికీ అతిపెద్ద పండగ. తెలుగు రాష్ట్రాలు రెండింటిలోనూ మూడు రోజులు (భోగి, మకర సంక్రాంతి, కనుమ), కొన్ని చోట్ల నాలుగు రోజులు (ముక్కనుమ తో ) జరుపుకుంటారు కాబట్టే పెద్ద పండగ అంటారు. ముఖ్యంగా పంటలు చేతికొచ్చిన ఆనందంతో రైతులు జరుపుకొనే పెద్ద పండుగ ఇది.

సంక్రాంతి అనగా సంక్రమణం, చలనం అని అర్థం. నిజానికి సూర్యుడు సంవత్సరమంతా ఒక్కొక్క రాశిలోకి ప్రవేశించడం ఒక్కొక్క సంక్రాంతి. అందుచేత సంవత్సరానికి పన్నెండు సంక్రాంతులు ఉంటాయి. కానీ పుష్యమాసంలో, హేమంత ఋతువులో మంచుకురిసే కాలంలో, సూర్యుడు 'మకరరాశి' లోకి మారగానే వచ్చే సంక్రాంతి 'మకర సంక్రాంతి' ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంటుంది. ఆరోజునుండిసూర్యుడు ఉత్తరాయణ పుణ్యకాలంలోకి ప్రవేశిస్తాడు. ఈరోజు స్వర్గ ద్వారాలు తెరిచి ఉంటాయని పురాణాలు పేర్కొన్నాయి. మకర సంక్రమణం నుండి ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభమై, కుంభ, మీనా, మేష, వృషభ, మిధున రాశులలో కొనసాగినంతకాలం ఉత్తరాయణ పుణ్యకాలం. ఈ కాలం పుణ్య కార్యాలకు, శుభకార్యాలకు, శారీరక పరిశ్రమకు, సాధనకు అత్యంత అనువైనది. ఆ తరువాత సూర్యుడు సింహ, కన్య, తుల, వృశ్చిక, ధను రాశులలో సంక్రమణం చెందడం దక్షణాయనము. పన్నెండు నెలల (సంవత్సర)కాలంలో ఉత్తరాయణ కాలం ఆరు నెలలు దేవతలకు పగలు, దక్షణాయణము ఆరు నెలలు రాత్రి. దేవతలు మేలుకొనే కాలము కాబట్టి, ఉత్తరాయణము పుణ్యకాలము. ఈ కారణము చేతనే ఉత్తరాయణ పుణ్యకాలము వరకు ఎదురు చూసి, మాఘ ఏకాదశి నాడు (భీష్మ ఏకాదశి) తనువు చాలించినాడు కురు వృద్ధుడు, భీష్మ పితామహుడు.

హిందువుల పండుగలలో సౌరమానము అనుసరించి జరుపుకునే పండుగ సంక్రాంతి ఒక్కటే. అందుకే ప్రతి సంవత్సరము దాదాపుగా ఒకే తేదీలలో జనవరి 14,15 వ తేదీలలో సంక్రాంతి పండుగ వస్తుంది. మిగిలిన పండుగలన్నీ భారతీయ సాంప్రదాయము ప్రకారము, చంద్రమానాన్ని అనుసరించి వస్తాయి.

ముఖ్యంగా సంక్రాంతి పండుగ ఋణవిముక్తి సాధనకు ఉద్దేశించబడినది. దైవ ఋణము, పిత్రు ఋణము, మనుష్య ఋణము, భూత ఋణము మరియు ఋషి ఋణము.

**దైవ ఋణము :–** ఇంద్ర, వరుణ, వాయు దేవతల సహకారంతో సూర్యుడు భూమిపై వర్షాన్ని మరియు అన్ని కాలాలు సమతూకంతో నడిచేవిధంగా చూసి, మనకు సమృద్ధిగా పంటలు పండి, మానవజీవితం కొనసాగేలా చేస్తున్నాడు. ఆ దేవతల రుణం తీర్చుకునేందుకు సంక్రాంతి నాడు, అభ్యంగన స్నానము చేసి, దేవతలని పూజించి, పాలు పొంగించి, కొత్తబియ్యము , కొత్త బెల్లము, పెసరపప్పు, నెయ్యిలతో పొంగళ్లు వండి సూర్యభగ వానుడికి, అగ్నికి, దేవతలందరకూ భక్తి, కృతజ్ఞతతో నివేదన చేయడం మన ఆచారము.

**పిత్రు ఋణము:–** పిత్రు తర్పణాలు, పిండోదక దానాలు, శ్రాద్ధ కర్మలు ఆచరించడం ద్వారా ,మరణించిన పిత్రు దేవతల రుణము కొంతైనా తీరుతుందని శాస్త్రాలు చెప్తున్నాయి. అందుకే ఈరోజున నువ్వులు, బెల్లము, బూడిద గుమ్మడికాయ, సువర్ణ, గోదానాలు ఇవ్వడం ద్వారా కొంత పిత్రు ఋణము తీరుతుందని విశ్వసిస్తారు.

**మనుష్య ఋణము:–** మనిషి సంఘజీవి. ఇతరుల సహాయ సహకారాలు లేకుండా సమాజములో జీవించడము కష్టము. అందుకే ఈ పండుగనాడు ఉన్నంతలో పేదలకు ధాన్యం,తిలలు, చెరకు, ఫలాలు,వస్త్రాలు వంటివి విరివిగా దాన ధర్మాలు చేస్తారు. వ్యవసాయానికి సహాయపడే ఇతర వృత్తులవారికి ధాన్యాన్ని పంచుతారు.

**ఋషి ఋణము:–** ఋషులు గ్రంధాలలో సూచించిన విధముగా ధార్మిక జీవనాన్ని గడుపుతూ, సాధు సంతులను గౌరవిస్తూ, పురాణ గ్రంధాలను పఠిస్తూ సాంప్రదాయ పాలన చెయ్యడమే ఋషి ఋణము తీర్చుకోవడము.

**భూత ఋణము:–** నీరు, భూమి, ఆకాశము, అగ్ని, వాయువు వంటి పంచ భూతాలు కరుణించడం వల్లనే, సకాలంలో వర్షాలు పడడము, అన్నికాలాలు సమానముగా వర్తించడం వలననే పంటలు పండి, మానవ జీవితము సుఖముగా సాగుతున్నది.అందుకే కృతజ్ఞతతో పంచభూతాలను ఆరాధిస్తాము. పంట పొలాల్లో పొంగలి మెతుకులు, పసుపు, కుంకుమ చల్లి, ఎర్రగుమ్మడి కాయ పగులగొట్టి సమర్పిస్తారు. పాడి గోవులను, ఎద్దులను కడిగి, కొమ్ములకు, మూపురాలకు పసుపు కుంకుమలు పూసి బొట్లు పెట్టి, గులాల్ చల్లి అలంకరించి పూజిస్తారు. వాటికి ప్రేమతో పొంగళ్లు, ఉలవలు, గుగ్గిళ్ళు తినిపిస్తారు . ఇళ్లముందు బియ్యపిండితో ముగ్గులు, పసుపు, కుంకుమ చల్లి భూమిని, క్రిమి కీటకాలను సంతృప్తి పరుస్తారు. పంట కళ్లాలలో వదిలిన ధాన్యం పక్షులు, మూగ జీవులకి ఆహారం అవుతుంది.ఈ విధంగా పశుఋణం తీర్చుకోవడం జరుగుతుంది.

**దానాలు :–** సంక్రాంతి నాడు చేసే దానాలకి గొప్ప ఫలం ఉంటుందని విశ్వశిస్తారు. పండ్లు, విసనకర్రలు, వస్త్రాలు,కాయగూరలు,దుంపలు, నువ్వులు, చెరకు మొదలైన వాటిని దానంగా ఇవ్వడం మంచిదని భావిస్తారు.

**భోగి పండుగ :–** పండుగ తొలిరోజు భోగి. తెల్లవారు ఝామున లేచి వీధుల కూడలిలో భోగి మంటలు వేస్తారు. ఇళ్లలో విరిగిపోయిన చెక్క సామాన్లు, కొయ్య వస్తువులు,తలుపు చెక్కలు, ఎండిన కంప, చెట్ల కొమ్మలు సమస్తం భోగి మంటల్లో వేస్తారు. ఇది ఒకరకంగా పాత సామాన్లు వదిలించుకోవడం.. చెడును వదిలించుకోవడం అన్నమాట. అటు తరువాత నువ్వుల నూనె, నువ్వుపిండి తో నలుగుపెట్టి, అభ్యంగన స్నానాలు చేసి, నూతన వస్త్రాలు ధరిస్తారు. కట్టెల పొయ్యిమీద కొత్త కుండను పెట్టి, పాలు పొంగించి , కొత్త బియ్యం, బెల్లంతో పొంగళ్లు వండి దేవతలకు నివేదన చేసి, ప్రసాదం ఆరగిస్తారు.





కొత్త బియ్యం పిండితో నువ్వులు కలిపి చక్కిలాలు (సకినాలు), పాలకాయలు, అరిసెలు, కజ్జికాయలు, పాల తాలికలు మొదలైన పిండివంటలు వండుకుంటారు ప్రత్యేకంగా సంక్రాంతికి.

భోగి నాడు సాయంత్రం స్త్రీలు చిన్నపిల్లలకు కీడు పోవాలని భోగిపళ్ళు పోస్తారు. కొత్త బియ్యం, రేగుపళ్ళు, పూలు, నాణాలు కలిపి పిల్లలందరినీ కూర్చోబెట్టి వారి చుట్టూ తిప్పి తలలపై పోస్తారు. ఈ విధంగా చేస్తే వారికి కీడు, చెడు దృష్టి పోతుందని నమ్మకం. పేరంటానికి వచ్చిన ముత్తైదువులందరకు పసుపు కుంకుమలు, శనగలు, పళ్ళు వాయినం ఇస్తారు.

**బొమ్మల కొలువు:–** సంక్రాంతి పండుగకు బొమ్మలకొలువు తీరుస్తారు కొందరు... ప్రతి పండుగకు ఒక కొత్త బొమ్మను కొని అలంకరించడం తప్పనిసరి. పండుగ మూడురోజులు బొమ్మలకొలువుకు హారతి ఇవ్వడం, నైవేద్యం సమర్పించడం, ముత్తైదువలను పేరంటాలకు పిలవడం తప్పని సరి. వచ్చినవారికి పసుపు కుంకుమలతోపాటు పళ్ళు, శనగలు, పిండి వంటలు, ఇస్తారు.

**మకర సంక్రాంతి:–** రెండవరోజు ముఖ్యమైన పండుగ సంక్రాంతి. సంక్రాంతి నాడు చిక్కుడుకాయలు, దోసకాయ, గుమ్మడికాయ ఆకుకూరలు కలిపి కలగలపు కూర చేస్తారు.పాయసం, వడపప్పు, పానకము, పులిహోర మొదలైన పిండివంటలతో దేవతార్చన, నివేదనలూ చేస్తారు.

**సంక్రాంతి నోములు :–** తెలంగాణా ప్రాంతములో సంక్రాంతి నోములు ఉంటాయి. ఐదు కొత్తకుండలు మూతలతో సహా ఒకదానిమీద ఒకటి పేరుస్తారు. కుండలమీద చక్కగా ముగ్గులు, బొట్లు అలంకరణ చేస్తారు. నువ్వులు, బెల్లం కలిపి నువ్వుల ఉండలు, పంచదార చిలుకలు, రేగుపళ్ళు, చెరుకు ముక్కలు, పూలు పెట్టి గౌరీ దేవికి పూజ చేస్తారు. నోము అంటే పదమూడు వాయనాలు ఇవ్వాలి. ఎక్కువ మందికి ఇవ్వాలంటే 13 సంఖ్యలో పెంచుకుంటూ ఇస్తారు. పళ్ళు, తమలపాకులతో నువ్వుల లడ్లు, రేగుపళ్ళు, చేరకుముక్కలు పంచుతారు.

**పతంగులు:–** సంక్రాంతి అంటే పట్టణాల్లో, పల్లెల్లో కూడా పతంగులు హడావుడి కనిపిస్తుంది. రంగు రంగుల పతంగులు, రకరకాల ఆకారాల్లో ఎగురవేయడం ఇప్పటి యువతరానికి అత్యంత ఇష్టమైన ఆట.

**ముగ్గులు, గొబ్బెమ్మలు :–** ధనుర్మాసం మొదలై నప్పటినుండి కనుమ పండగ వరకు నెలరోజులు ఇళ్లముందు తీరైన రంగవల్లులు తీర్చిదిద్దుతారు. ఇళ్ల ముందు గోమయముతో కళ్ళాపి జల్లి, తెల్లని బియ్య ప్పిండితో చుక్కల ముగ్గులు, గీతలు ముగ్గులు వేసి, ఆవుపేడ తో చేసిన గొబ్బెమ్మలు పెడతారు. గొబ్బెమ్మలను పసుపుకుంకుమలతో, పూలతో అలంకరిస్తారు. సాయం సమయాలలో కన్నెపిల్లలు సంధ్య గొబ్బెమ్మలను పెట్టి, చుట్టూ తిరుగుతూ పాటలు పాడతారు.

**గొబ్బెమ్మ పాట:– అమ్మాయిలు**
సుబ్బీ గొబ్బెమ్మ – శుభముల నియ్యావే
తామర పువ్వంటి తమ్ముణ్ణియ్యావే
చేమంతి పువ్వంటి చెల్లెల్నియ్యావే
మొగలి పువ్వంటి మరిది నియ్యావే
మల్లె పువ్వంటి మొగుణ్ణియ్యావే
మంకెన పువ్వంటి మరదలినియ్యావే..”
అంటూ పాడతారు.

ఇక్కడ మధ్యలో పెద్ద గొబ్బెమ్మ కృష్ణునిగా, చుట్టూ ఉన్న గొబ్బెమ్మలు గోపికలుగా ఊహించుకొంటారు. గోపి 'బొమ్మలు' గొబ్బెమ్మలు అని అంటారు. నెలరోజుల గొబ్బెమ్మలు ఎండబెట్టి, భోగి రోజు పొంగలి వండే పొయ్యిలోనో, పండుగ రోజు వంట వండే పొయ్యిలోనో వేస్తారు.

సంక్రాంతి రోజున ఇంటిముందు స్వర్గద్వారాలు తెరచుకున్న ముగ్గు వేస్తారు. కనుమ రోజు పితృదేవతలు రథం ఎక్కి స్వర్గానికి వెళ్ళడానికి, తప్పనిసరిగా రథం ముగ్గు వేస్తారు.

**హరిదాసులు, గంగిరెద్దులు:–** సంక్రాంతి హడావుడి పల్లెల్లో అంతా, ఇంతా అని చెప్పలేము. అన్ని వాకిళ్ళు రంగు, రంగుల రంగవల్లులు నింపుకుంటాయి. తలమీద తలపాగా చుట్టుకుని, చక్కగా తోమి తళతళ మెరిసే ఇత్తడి పాత్ర , చేతిలో చిరుతలు పట్టుకుని, కాళ్ళ గజ్జలతో చిందులేస్తూ, “హరిలో రంగ హరి” అంటూ హరినామ స్మరణతో తిరిగే హరిదాసులు ఇంటింటికీ తిరిగి పాత్రలో బియ్యాన్ని వేయించుకుంటారు. వారికి తమగుప్పెళ్లతో బియ్యాన్ని వేయడానికి చిన్నారులు పోటీ పడతారు. సన్నాయి మేళాలతో వచ్చే గంగిరెద్దు ఆటగాళ్లు కూడా సంక్రాంతి ప్రత్యేకమే. రంగు రంగుల బట్టలతో ఎద్దును అలంకరించి, కొమ్ములకు రంగులు, కాళ్లకు గజ్జెలు, మెళ్ళో గంటలు కట్టి... సన్నాయి ఊదుతూ... ఎద్దుతో విన్యాసాలు చేయించి, పాత బట్టలు, ధాన్యము అడిగి తీసుకుంటారు. అలాగే బుడబుక్కల వారు కూడా డబ్బు, ధాన్యము అడుక్కుంటారు .

**కనుమ పండుగ :–** కనుమ రోజు మినుము తినాలి అంటారు.మినప గారెలు వండుతారు. మాంసాహారులు ప్రత్యేకంగా మాంసాహారాన్ని వండుకుంటారు. పశువులను అలంకరిస్తారు. ఎడ్ల పందాలు నిర్వహిస్తారు. ఆంధ్రా ప్రాంతంలో కోళ్ల పందాలు ఎక్కువ. ప్రభుత్వం నిషేధించినా కోళ్ల పందాలు నిరాటంకంగా జరగడం, అవి ఎంత ప్రాముఖ్యం పొందాయో తెలుస్తుంది. కనుమ పండగనాడు ఇంటికి వచ్చిన బంధువులను ప్రయాణం చెయ్యనివ్వరు. కొన్ని ప్రాంతాలలో ముక్కనుమ కూడా జరుపుకుంటారు.

సంక్రాతి పండుగ మూడు రోజులు అత్యంత సందడిగా, ఆనందోత్సాహాలతో జరుపుకుంటారు అనడానికి ఇంతకంటే నిదర్శనం ఏముంటుంది.?

తెలుగు ప్రజలందరికీ మకర సంక్రాంతి శుభాభినందనలు ! జై హింద్ !

**– నూతులపాటి ఉషారాణి**




# తిట్లు దీవెనలవుతాయ్ మేధావుల శిరోమర్దన

**ఓరి దురాత్మ నీవా ముష్టింపచా/భాస యోజన గంధి ప్రథమ పుత్ర!**
**వేదరన్యా దుర్భావనా పరతంత్ర/ బహు సంహిత వృథాభ్యాస పఠన!**
**భారత గ్రంథ గుంపున పండితమ్మన్య/వీవా మదీ పత్నికి సశేష**
**కైవల్య కల్యాణ ఘంటా పథమునకు/కాశికాపురికి నిష్కారణంబ**
**శాపమిచ్చెదనని యనాచార సరణి/ హుంకరించినవాడ వహంకరించి**
**పొమ్ము నిర్భాగ్య! మయూరి పొలము వదలి/ఎచటికే శిష్యుల్న్ నీవు నీ క్షణంబ!**

మేధావులం అనుకునే వాళ్లలో చాలామందిలో తమ గురించి తాము ఎక్కువగా ఊహించుకుని, తమకు చాలినంత చేయలేదని ఆరోపిస్తూ ఇతరులను నిందించే ఒక లక్షణం ఉంటుంది. వాళ్లడిగింది ఇవ్వని వాళ్ళను నోటికొచ్చినట్లు తిట్టి, చెడ్డ ప్రచారం చేయటం చదువుకున్న వాళ్లలో కనిపించే ఒక లక్షణం. ఈ దేశం మీద ఆధారపడి చదువుకుని ఈ దేశాన్ని తిట్టి విదేశాలకు ఎగిరిపోవాలని తహతహలాడే గుణం చదువుకున్న వాళ్ళలోనే ఉంటుంది. ఇలాంటి వింత ప్రవృత్తుల్ని శ్రీనాథుడు ఖండించాలనుకున్నాడు. అందుకోసం వ్యాసుడు కాశీని శపించే కథని ఎంచుకున్నాడు.



బాగా చదువుకున్నవాడు, మేథావి, వేదాలను విభజించి, ఒక క్రమ పద్ధతిలో అమర్చినవాడు, మహాభారతాన్ని, అష్టాదశ పురాణాల్నీ ఇంకా చాల రచనల్ని చేసినవాడు, అంతటివాడు మరొకడు లేడనిపించుకున్నవాడు వ్యాసుడు. ఆయన చదువుకీ, ఆయన వ్యక్తిత్వానికి పొంతన ఉన్నదా లేదా అని పరీక్షించాలని అనిపించింది పరమేశ్వరుడికి. వ్యాసుడు కాశీ నగరానికి వచ్చిన ఒక సమయం చూసుకుని, అక్కడి తిండి దొరక్కుండా చేశాడు. జనం ఆకలికి మాడుతూ వెళ్లి అన్నపూర్ణను వేడుకొని ఆమె పెట్టిన భిక్ష స్వీకరించి కడుపు నింపుకుంటున్నారు. వ్యాసుడికి ఆయన వెయ్యిమంది శిష్యులకు ఎక్కడా తిండి దొరకలేదు. అన్నపూర్ణాదేవి భిక్ష కోసం పిలుస్తుందని ఎదురు చూశాడు. ఐదు రోజులు నిరాహారదీక్ష చేసినా భిక్షకు పిలుపురాలేదు. దాంతో ఓపలేక కాశీపురాన్ని శపించటం మొదలుపెట్టాడు. అప్పుడు అన్నపూర్ణాదేవి వ్యాసుణ్ణీ, అతని శిష్యుల్నీ పిలిచి, కడుపునిండా అన్నం పెట్టింది. కానీ, అసలు కథ అప్పుడే మొదలయ్యింది. అడగందే అమ్మయినా అన్నం పెట్టరనే విషయాన్ని గమనించలేకపోయాడు వ్యాసుడు. చదువుకున్న అహంకారంతో జన్మభూమిని శపించబోయినందున వ్యాసుణ్ణి పరమేశ్వరుడు ఛడామడా వాయిం చేశాడు. శ్రీనాథుడి శ్రీభీమేశ్వరపురాణం (భీమఖండం)లో శివుడు వ్యాసుడి మేధస్సుని బాగా మర్ధించి అహంకార హుంకారాలను అణిచి వేయడం ఈ పద్యంలో కనిపిస్తుంది.

'ఓరీ దురాత్ముడా! 'నీవార ముష్టింపచా భాస'– నీవారాలంటే నివ్వరి వడ్లు, నూర్పుళ్లు అయిపోయాక అక్కడ రాలిపడిన వరి గింజలు ఏరుకు తెచ్చుకుని వండుకుని తినే పూటకు ఠికాణాలేని... యోజన గంధి ప్రథమ పుత్ర– చేపలవాసన కొట్టే సత్యవతికి (పరాశరుడి ద్వారా) అక్రమంగా పుట్టినవాడా! దేవర న్యా దుర్భావనా పరతంత్ర – సోదరులు సంతానం లేకుండా చనిపోతే వాళ్ళ భార్యల ద్వారా సంతానాన్ని కనే 'పరతంత్రం' అంటే మనదికాని దురాచారం కలిగినవాడా, బహు సంహితా వృథాభ్యాస పఠన– వేదాలు అనాదిగా ఉన్నాయి. అలాంటి ఆదిమ గ్రంథాలను విభజించాలని వృథాభ్యాస పఠన శ్రమపడిన వాడా... భారత గ్రంథ గుంపన పండితమ్మన్య– భారతం అనే గ్రంథాన్ని రాసి, గొప్ప పండితుడివేమీ కాకపోయినా అయినట్లు కనిపించే వాడా! 'శాపమిచ్చెదనని యనాచార సరణి హుంకరించిన వాడ వహంకరించి– ఆచారాన్నీ ధర్మాన్నీ పాటించకుండా అహంకారంతో శాపమిస్తానని హుంకరించావు. 'మదీయ పత్నికి సశేష కైవల్య కళ్యాణ ఘంటా పథమునకు' కాశికాపురం అంటే నా పత్ని, అశేష కైవల్యానికి కాశీ ఘంటాపథం. ఇక్కడ మరణిస్తే నేరుగా కైవల్యం పొందుతాడు. అటువంటి కాశీపురానికి శాపం ఇస్తానంటూ బయల్దేరిన అనాచారీ! 'పొమ్ము నిర్భాగ్య! యా యూరి పొలము వదలి ఎచటికే శిష్యుల్న్ నీ క్షణంబ!'

దరిద్రుడా! మా ఐరి పొలిమేరలు దాటి ఈ క్షణాన్నే నీ శిష్యులతో సహా వెళ్లిపో' అని తిట్టాడు పరమశివుడు. అన్నం పెట్టించి మరీ తిట్టాడు. జన్మనిచ్చిన తల్లిని, జన్మభూమిని, చదువు చెప్పించి ఇంతవాణ్ణి చేసిన దేశాన్నీ, ఈ దేశ సంస్కృతీ వికాసాలను ద్వేషించే పరభాషా వ్యామోహపరులందరికీ ఈ తిట్లు తగులుతాయి. తగలాలి కూడా! మన భాషా సంస్కృతుల పట్ల, ఆచార వ్యవహారాల పట్ల వైమనస్యం, విముఖత, తిరస్కారం ప్రదర్శించిన వాళ్లకు ఈ పద్యాన్ని చదివి వినిపించాలి. 'అనాచార సరణి హుంకరించిన వాద వహంకరించి' అనటంలో ఇంత అర్థం ఉంది. దేశీయతని తక్కువ చేసి చూడటాన్ని అనాచారమేనంటాడు పరమశివుడి ద్వారా శ్రీనాథుడు. దేశీయ సంస్కృతీ భాషాభిమానాలు లేని వాళ్లందరినీ కలిపి తిట్టాడని మనం అన్వయించుకోవాలి. దేశానికి రాజైనా నేలతల్లికి కన్నబిడ్డడినే నన్న సంగతి మరచి విదేశీ మానసపుత్రులుగా భావించుకునే అపరవ్యాసరాయుళ్ళ తెలివైన బుర్ర మర్ధించే పద్యం ఇది.

ఆ 'గంగ' కావలి వొడ్డునున్న ప్రదేశం వ్యాసకాశీగా పేరొందింది. శివునిచే పరాభవింపబడిన వ్యాసుడక్కడ వ్యాసాశ్రమం నిర్మించుకున్నాడు. నిజానికది కాశీ రాజు ఆవాసం.

– డా. జి.వి. పూర్ణచంద్రుడు




**SRI RAJARAJESWARI JEWELLERY**

**The Oldest Jewellery Shop in Pondy Bazaar**

81, Pondy Bazar, T. Nagar, Chennai - 600 017.
Phones : 28152387, 28154653

*The Purest Treasurer Mortal Times Afford is Spotless Reputation*

# నిరతాన్నదాత్రి
# శ్రీమతి డొక్కా సీతమ్మ గారు

డొక్కా ఫణి

ఆకలి మనిషిచేత ఏమైనా చేయిస్తుంది. ఆకలి బాధని తీర్చుకోవడానికి మనిషి ఎన్నో చెయ్యరాని కార్యాలు చెయ్యడానికి కూడా వెనుకాడడు. ప్రాణి బతకడానికి ఆహారం కావాలి. కడుపునిండిన వాడి మనసులో చెడ్డ ఆలోచనలు రావు. తన పొట్ట నిండిన నాడు మనిషి పక్కవాడి మేలు గురించి ఆలోచిస్తాడు. అలా నలుగురూ ఆలోచిస్తే, సమాజం బాగుపడుతుంది. అందువలన అన్నదానాన్ని మించిన దానమేలేదు. మరే దానం చేసినా, గ్రహీత ఇంకా ఇంకా కావాలని ఆశించే అవకాశం వుంది. మనం కోట్లు కుమ్మరించినా, దానాన్ని స్వీకరించేవారు మరిన్ని కోట్లు రావాలని ఆశించవచ్చు. అలాగే గోదానమూ, భూదానమూ, కనక వస్తు వాహనాల దానమూను. అయితే, ఒక్క అన్నదానంలో మాత్రమే దానం స్వీకరించిన వారు సంపూర్ణంగా, ఏ లోటూ లేకుండా తృప్తి చెందుతారు. మృష్టాన్న భోజనము చేయడం వలన శరీరములోని సకల అవయవములకు, మనసుకు, ఆత్మకూ ఏకకాలం లో తృప్తి కలుగుతుంది. అలా భోజనం చేసినవారు, ఆ అన్నదాతను మనస్ఫూర్తిగా ఆశీర్వదిస్తారు. వారి వంశం కలకాలం చల్లగా వుండాలని దీవెనలందిస్తారు.



మహాభారతంలో అశ్వమేధ పర్వంలో, అన్నదాన మహిమకు సంబంధించిన ఒక కథ వుంది. కురుక్షేత్ర సంగ్రామం తరువాత ధర్మరాజు అశ్వమేధం చేస్తాడు. ఆసమయంలో అతిథులందరికీ కావలసినవన్నీ ఇచ్చి, సమస్తమూ దానం చేస్తాడు. అందరూ అతని దాన గుణాన్ని వేనోళ్ళ కొనియాడతారు. అప్పుడు అక్కడికి ఒక ముంగిస వస్తుంది. దాని శరీరం సగం బంగారు వర్ణంలో వుంటుంది. "ధర్మ రాజా, నీకు నిజమైన అన్నదానం ఎలా వుంటుందో చెబుతాను విను. ఈ కురుక్షేత్ర భూమిలోనే, ఎన్నో ఏళ్ళ క్రితం సక్తుప్రస్థుడు అనే మహాత్ముడు ఉండేవాడు. ఆయన, భార్య, కొడుకు, కోడలు నలుగురూ, జీవకోటిని కరుణతో, దయతో చూస్తూ, కామ క్రోధాలను విడిచి, ధర్మ బద్ధంగా జీవితాన్ని గడిపేవారు. అతిథి అభ్యాగతులను దేవుళ్ళవలె పూజించి ఆదరించి పంపేవారు. కేవలం జీవితాన్ని నిలుపుకోవడానికి ఎంత ఆహారం కావాలో అంత మాత్రమే తినేవారు. కడు పేదలైనప్పటికీ పరమేశ్వర ధ్యానంలో జీవితం గడిపేవారు. ఒక రోజు వారికి అతి తక్కువ ఆహారం దొరికింది. కేవలం ఒక రొట్టికి సరిపోయే పిండి మాత్రమే సమకూరినది. ఆ చిన్ని రొట్టెను నాలుగు భాగాలు చేసుకుని వారు తినడానికి సిద్ధమౌతున్న సమయంలో ఒక అతిథి వచ్చి "తన ప్రాణం పోతోన్నదనీ, తనకు ఏదైనా ఆహారం ఇవ్వమనీ" కోరాడు. అప్పుడు సక్తుప్రస్థుడు తన వంతు రొట్టే ముక్కను ఇచ్చాడు. అది తిన్న అతిథి తన ఆకలి బాధ మరింత ఎక్కువైనదని చెప్పాడు. అప్పుడు ఆ కుటుంబంలోని అందరూ తమ వంతు రొట్టెను ఇచ్చి వేసారు. అవి తిన్న అతిథి తృప్తిగా వారిని దీవించాడు. "మీ అతిథి సత్కారం, అన్నదానం నాకు నచ్చాయి. మీరంతా ప్రాణాలు పోయేటంతటి ఆకలితో బాధపడుతూ కూడా, మీరు తినబోయే ఆహారం నాకు దానం చేసి, ఎంతో పుణ్యం సంపాదించుకున్నారు. మీ దానబుద్ధికి దేవతలు సంతోషిస్తారు. అన్ని లోకాలూ మిమ్ములను ప్రశంసిస్తాయి. దానము, భూత దయ ఈ రెండు వున్న మీకు మోక్షం లభిస్తుంది" అని దీవించాడు. అప్పుడు పరమాత్మ వారికొరకు పుష్పక విమానాన్ని పంపించాడు. వారు దివ్యలోకాలకు తరలి వెళ్ళారు. ఆ దృశ్యాన్ని చూసిన నేను, సక్తుప్రస్థుడు ఆ అతిథి కాళ్ళు కడిగిన నీటిలో అప్రయత్నంగా తిరిగాను. అప్పుడు నా శరీరం లో ఆ తడి తగిలిన సగ భాగం బంగారు రంగులోకి మారింది. దానమంటే అలా వుండాలి. అప్పటినించీ ఎన్నో దాన, ధర్మ ప్రదేశాలు తిరిగాను. అయినా నా రెండవ ప్రక్క బంగారు రంగు రాలేదు, ఇక్కడ కూడా రాలేదు" అని నవ్వుతూ వెళ్ళిపోయిందిట. అన్నదానము ఎలా చెయ్యాలో, ఎంత ప్రేమతో, దయతో, మాతృహృదయంతో, అపారమైన త్యాగ బుద్ధితో చెయ్యాలో ఈ కథ మనకు

నా పరిచయం:

నేను డొక్కా సీతమ్మగారి మనవడికి మనవడిని. డొక్కా సీతమ్మగారి మనుమడు (సుబ్బారాయుడి గారి కొడుకు) శ్రీ డొక్కా రామభద్రుడు గారు మా తాతగారు. మా నాన్నగారి పేరు శ్రీ.డొక్కా సూర్యనారాయణ గారు. అమ్మపేరు శ్రీమతి.గంటి బాలా త్రిపుర సుందరి. నా పేరు డొక్కా శ్రీనివాస ఫణి కుమార్ (డొక్కా ఫణి). నేను గత రెండు దశాబ్దాలుగా అమెరికాలోని అట్లాంటాలో వుంటున్నాను. మా అన్న పేరు శ్రీ డొక్కా రామభద్ర. తమ్ముడి పేరు డొక్కా వంశీ కృష్ణ. ఈ వ్యాసం మా లంకల గన్నవరం లో కొలువైన మా దైవం శ్రీ రాజగోపాలస్వామికి అంకితం.

వివరిస్తుంది.

భారతదేశాన్ని ఆంగ్లేయులు పరిపాలిస్తున్న రోజులవి. పద్దెనిమిది వందల నలభైలనాటి మాట. అకాలంలో ఒక వూరినించి మరొక వూరికి ప్రయాణాలన్నీ బండ్ల మీద సాగుతూ వుండేవి. గమ్యం చేరుకోవడానికి కొన్ని రోజులు పట్టేది. మార్గ మధ్యంలో భోజనాలు దొరకక పెద్దలూ, పిల్లలూ ఎంతో ఇబ్బంది పడేవారు. హోటళ్ళు లేవు. కొందరు ధర్మాత్ములు కట్టించిన సత్రాలు ఉన్నా, అవి చాలా తక్కువమందికి మాత్రమే ఉపయోగపడేవి. ప్రతి సత్రానికి ఒక గుమాస్తా వుండేవాడు. అతని దయా దాక్షిణ్యాలపై సత్రం నిర్వహణ జరిగేది. అతను పద్దులు రాయటం పూర్తైన తరువాత, ఉదయం ఏ పన్నెండుగంటలకో ఒకసారి, తిరిగి రాత్రి ఒక సారి మాత్రమే భోజనం పెట్టేవారు. మిగితా సమయాలలో వచ్చిన వారికి మొండిచెయ్యే మిగిలేది. భోజనం పెట్టే సమయంలో కూడా సూటి పోటి మాటలంటూ "తేరగా వచ్చిన తిండి, తినండి, మీకు రాసిపెట్టుంది మరి" అంటూ హేళన చేసేవారు. దానితో ప్రయాణీకులు ఈ సత్రాలకి రావడానికే భయపడి పస్తులతోనే ప్రయాణాలు సాగించేవారు. పిల్లలు ఆకలికి తాళలేక విలవిలలాడిపోయేవారు. "దూషణ భూషణ తిరస్కారములు ఆశీస్సులుగా భావించే" యే పేకాట రాయుళ్ళకో, వ్యసన పరులకో, సోమరులకో మాత్రమే బాగా ఉపయోగ పడేవి చాలా సత్రాలు.

అటువంటి కాలంలో అపర అన్నపూర్ణగా, నిరతాన్నదాత్రిగా ఖండాంతర కీర్తినార్జించిన శ్రీమతి డొక్కా సీతమ్మగారు జన్మించారు. ఆ మహా సాధ్వి గురించి "విబుధ జనులవలన విన్నంత కన్నంత, తెలియవచ్చినంత" వివరించాలనే ఉద్దేశ్యం తోనే ఈ వ్యాసానికి శ్రీకారం చుట్టాను. గొప్పలు చెప్పుకోవాలనో, కీర్తి చాటుకోవాలనో కాదు. కేవలం అపర అన్నపూర్ణ డొక్కా సీతమ్మగారి గురించి నాకు, మా వంశస్థులకు తెలిసిన వివరాలు, ఆసక్తి గలవారితో పంచుకోవాలనే ఉద్దేశ్యంతో చేస్తున్న ప్రయత్నం ఇది. తప్పులుంటే పెద్దలు సవరించగలరు. బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర రావు గారు చెప్పే ప్రవచనాలలో డొక్కా సీతమ్మగారిని గురించి చెప్పడం విన్న ఎంతో మంది నాకు, అన్నకు ఫోను చేసి, ఈమెయిలు చేసి, మరిన్ని వివరాలు కావాలని పదే పదే అడగడంతో, మావద్ద వున్న సమాచారం సేకరించి, ఈ వ్యాసంగా రాస్తున్నాను.

కోనసీమలో చతుర్వేదపారంగతులైన పండితోత్తములకు నిలయమైన పేరూరు అనే గ్రామము వుంది. అక్కడ ద్రావిడ వంశమునకు చెందిన శ్రీ.డొక్కా వారి కుటుంబంలో శ్రీ.డొక్కా జోగన్న గారు క్రీ.శ 1804 (రక్తాక్షి నామ సంవత్సరం) లో జన్మించారు. వీరి తండ్రి శ్రీ.డొక్కా విశ్వేశ్వరుడు గారు, తల్లి శ్రీమతి సోదెమ్మ. విశ్వేశ్వరుడు గారికి ఐదుగురు మగ పిల్లలు. నాలుగవ వారు జోగన్న గారు.

1) సూరన్నగారు 2) నరసన్నగారు3) సుబ్రహ్మణ్యం గారు4) వెంకట జోగన్న గారు 5) జగ్గన్న గారు

సూరన్నగారు, నరసన్నగారు ఇల్లరికపుటల్లుళ్ళుగా వక్కలంక వెళిపోయారు. సుబ్రహ్మణ్యంగారు చిన్నప్పుడే చనిపోయారు. మిగిలిన వెంకట జోగన్న గారు, జగ్గన్న గారు లంకల గన్నవరములో వ్యవసాయము చేసుకొనే వారు. జోగన్న గారు వేద పండితులు. సదాచార సంపన్నులు. సాముద్రిక శాస్త్రమునందు నిపుణులు. వీరి మొదటి భార్య పేరు లక్ష్మీ దేవి. వారికి సూర్యనారాయణ అను కొడుకు పుట్టాడు. అయితే భార్య లక్ష్మి దేవి గారు, కుమారుడు సూర్యనారాయణ చనిపోయారు. అప్పుడు జోగన్న గారు సుబ్బమ్మను పెళ్ళిచేసుకున్నారు. కొంతకాలానికి ఆమె విశ్వేశ్వరుడను పిల్లవాడికి జన్మనిచ్చి చనిపోయారు. జోగన్న గారు ఎంతో విచారించి, ఎన్నో ఏళ్ళు ఒంటరిగా గడిపి కుమారుణ్ణి పెంచారు.

మండపేట గ్రామములోని అనప్పిండి భవానీ శంకరం గారు (బువ్వన్న గారు), నరసమ్మ దంపతులకు జన్మించిన కుమార్తెయే సీతమ్మ గారు. డొక్కా సీతమ్మగారు 1841 (ప్లవ నామ సంవత్సరం) లో జన్మించారు. భవానీ శంకరం గారు వేద

వేదాంగములను అభ్యసించిన మహా మేధావి. సీతమ్మ గారి పసితనమునందే నరసమ్మగారు చనిపోయారు. తల్లి లేని బిడ్డను భవానీ శంకరం గారే ఎంతో జాగ్రత్తగా పెంచారు. ఒక రోజు డొక్కా జోగన్న గారు వేద సభలలో చర్చలు చేసి, విజయులై, ఎన్నో సన్మానములను పొంది తిరిగి వస్తూ, మధ్యాహ్న భోజన సమయమునకు మండపేటకు చేరారు. ఆ వూరిలో వేద పండితులైన భవానీ శంకరం గారింట స్వయం పాకము చేసికొనవచ్చు కదా అని యోచించి వారింటికి వచ్చారు. ఆ సమయానికి భవానీ శంకరంగారు ఇంటిలో లేరు. వారి కుమార్తె సీతమ్మ గారు వున్నారు. సీతమ్మ గారు జోగన్న గారిని ఆదరించి, ఆయన స్వయంపాకమునకు కావలసిన సామాగ్రినంతయు సమకూర్చి ఇచ్చారు. జోగన్న గారు ఆ బాలిక త్యాగ బుద్ధికి, తెలివి తేటలకు, ఆదరణకు ముగ్ధులై స్వయంపాకము చేసుకొంటున్నారు. ఇంతలో భవానీ శంకరం గారు వచ్చి, మహాపండితులైన డొక్కా జోగన్న గారు తమ యింటికి వచ్చుట చూసి, అమితానంద పడి, వారిని ఆదరించి, ఎన్నోరీతుల సత్కరించి పంపారు. డొక్కా జోగన్న గారి వంటి పండితోత్తమునకు తన కూతురునిచ్చి పెండ్లి చేయాలని మనసులో సంకల్పము చేసుకొన్నారు. సీతమ్మ గారి చురుకుతనము, అణకువ, త్యాగబుద్ధి చూసి, సాముద్రిక శాస్త్రము సూచించిన అనేక శుభలక్షణములు గలిగిన ఆ బాలికను వివాహము చేసుకొన్న బాగుండునని, ఆమె వున్న చోట ఏ కొఱత వుండదని, ఆ వంశమునకు చిర కీర్తి లభించునని గ్రహించిన జోగన్నగారు కూడా వివాహము చేసుకొన్నచో బాగుండునని తలచారు. పిమ్మట ఆచారము ప్రకారము భవానీ శంకరము గారు తమ వూరి పెద్దలను తోడ్కొని వచ్చి, వారి ద్వారా తన కుమర్తెను జోగన్నగారికిచ్చి పెండ్లిచేయవలెనను తమ ఆకాంక్షను జోగన్నగారికి తెలియజేసారు. ఆయన సమ్మతించారు. గృహస్థాశ్రమ విధులకూ, యజ్ఞ యాగాదులకు ఆటంకము కలుగకూడదనే ఉద్దేశ్యముతో, శ్రీ డొక్కా జోగన్న గారు 1850 ("సాధారణ" నామ సంవత్సరము) లో సీతమ్మగారిని వివాహమాడారు. వివాహం నాటికి సీతమ్మగారికి తొమ్మిదేళ్ళు. చిన్నతనంలోనే సీతమ్మగారు అత్తవారింటికి వచ్చారు. పాడి పంటలకు లోటులేని కుటుంబము. ఎన్నో బాధ్యతలను అంత చిన్న వయసునుంచి, ఎంతో సమర్థవంతంగా నిర్వహించారు సీతమ్మగారు. ఎంతమంది పనివారున్నా, ప్రతి పనీ స్వయముగా దగ్గరుండి చూసుకొనేవారు. ఊరిలో ఎవరికి ఏ ఆపదవచ్చినా అది తమదిగా భావించి, వారికి తగిన సహాయం చేసేవారు. మొదటిలో భర్త జోగన్నగారు ఏమనుకుంటారో అని కాస్త బెరుకుగా వుండేవారు. అయితే మహాపండితులైన జోగన్న గారు, అన్నదాన విషములయందు, పరోపకార విషయములయందు సీతమ్మగారిని ఎంతో ప్రోత్సహించేవారు. అప్పటినుండి వచ్చు పోవు వారికందరికీ భోజనములను ఏర్పాటు చేయుట విధిగా చేసేవారు సీతమ్మగారు. రేవులు దాటే సౌకర్యాలు సరిగా లేకపోవటం వలన, ప్రయాణ సౌకర్యాలు అంతగా లేకపోవడం వలన, ఎంతో మంది మార్గస్థులు లంకల గన్నవరం లో ఆగేవారు. సీతమ్మగారి ఖ్యాతి విని వారింటికి వచ్చేవారు. వారందరికీ మజ్జిగ తేటను, భోజనాలను, ఫలహారాలను సమకూర్చేవారు సీతమ్మగారు. సీతమ్మగారి అన్నదాన వ్రతమునకు వేళ లేదు. 24 గంటలలో ఎప్పుడు, ఏవేళ, ఎవరు వచ్చినా, వారి కడుపు నింపి, వారిని ఆదరించేవారు సీతమ్మగారు. ఇలా ఎన్నో యేళ్ళు చేయడం వల్ల ఆవిడ ఆరోగ్యము దెబ్బతింది. అయితే ఆవిషయం జోగన్నగారికి తెలియనీయలేదు. ఆవిడ క్రమముగా చిక్కిపోవడం గమనించిన జోగన్న గారు, సీతమ్మగారిని విశ్రాంతి తీసుకోమని చెప్పారు. వేళకు వచ్చిన వారికి భోజనము పెట్టుమని తక్కిన సమయంలో కాస్త విశ్రాంతి తీసుకోమని సూచించారు. అయితే అతిథులకు, అన్నార్తులకు ఇబ్బంది కలుగుతుందని, తన ఆరోగ్యము బాగానే వున్నదని చెప్పి సీతమ్మగారు అన్నదాన వ్రతం కొనసాగించారు. జోగన్న గారు ఆవిడకు వంటలు వండడానికి సాయంగా కొంత మంది వంట బ్రాహ్మలను ఏర్పాటు చేసారు. వారే వండి వడ్డిస్తారని చెప్పారు. అయితే సీతమ్మగారు, వారు వండినప్పటికీ, వడ్డన మాత్రము తానే స్వయముగా చేసి, అందరికీ కొసరి కొసరి తినిపించేవారు. వేళ కాని వేళ వచ్చిన అతిథులకు వంట కూడా తానే చేసి, వడ్డించేవారు. అందరినీ బతిమాలి, బుజ్జగించి, వారి మొహమాటాన్ని పోగొట్టి, కన్న తల్లిలాగ అన్ని రకాల వంటలూ చేసి, వడ్డించి, దగ్గరుండి, కొసరి కొసరి తినిపించే వారు సీతమ్మగారు. ఒక గదిలో తరవాణి కుండలు పెట్టించి, చద్దెన్నము నిండుగ నింపి, ఏ అర్థరాత్రి ఎవరు వచ్చినా వారికి ముందుగా ఆ అన్నంపెట్టి, ఆకలి మంట చల్లార్చి, పిమ్మట వంట చేసి తృప్తిగా భోజనము పెట్టేవారు సీతమ్మగారు.

సీతమ్మగారికి, జోగన్నగారికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు పుట్టారు. 1.సుబ్బారాయుడు గారు 2.గోపాలం గారు 3. నరసమ్మ గారు (చాకుళ్ళ అయ్యగారి రామకృష్ణయ్య గారి భార్య) 4. సోదెమ్మ గారు.

తమ పెద్ద కుమారుడైన సుబ్బారాయునకు, తన మరిదిగారైన జగ్గన్నగారి కూతురు కూతురు (మనుమరాలు) సుబ్బమ్మను ఇచ్చి పెండ్లిచేసారు సీతమ్మగారు.

## అంతర్వేది ప్రయాణము - పెళ్ళివారి రాక

అన్నదానానికి భంగం కలుగుతుందనే ఉద్దేశ్యంతో ఎన్నడూ ఇల్లు కదలని సీతమ్మగారు, ఒకే ఒక్క సారి, దగ్గరలోని అంతర్వేది నరసింహస్వామిని దర్శించుకుని రావాలనే కోరికతో మేనాలో బయలుదేరారు. మేనా కొంత దూరం వెళ్ళింది. బోయీలు ఓ పంట చేను పక్కన చెట్టువారగా విశ్రాంతి తీసుకుంటున్నారు. అదే సమయంలో ఒక పెద్ద పెళ్ళివారి గుంపు వేరొక ఊరినించి వచ్చి అక్కడే విశ్రాంతి తీసుకుంది. ఆ గుంపులోని పెద్దలు, పిల్లలు ఆకలికి తాళలేకపోతున్నారు. పిల్లలు ఏడుపులందుకున్నారు. పెద్దవాళ్ళు వాళ్ళను ఊరుకోబెడుతూ "ఏడవద్దు పిల్లలూ, మరి కాస్త సేపట్లో మనం డొక్కా సీతమ్మగారి ఇంటికెళిపోదాం. అక్కడ హాయిగా అందరమూ కడుపు నిండా భోజనం చేసి, హాయిగా విశ్రాంతి తీసుకుందాం" అంటున్నారు. ఈ మాట సీతమ్మగారి చెవిన పడింది. మానవ సేవే మాధవ సేవ అని గట్టిగా నమ్మిన ఆవిడ, మరుక్షణమే తన మేనాను వెనుకకు తిప్పి వీలైనంత వేగంగా ఇంటికి తీసుకుపొమ్మని బోయీలకు చెప్పారు. అడ్డదారిన, పెళ్ళి వారికంటే అరగంట ముందుగా ఇల్లుచేరారు ఆవిడ. అయినా అరగంటలో ఏమి వంట చేయగలరు? అందునా సుమారు వందమంది పెళ్ళివారికి? అందుకనే ఆవిడ ముందుగా అటక మీదనించి బెల్లం బుట్టలు దింపించి, శ్రీరామ నవమి రోజున దేవునకు అర్పించే బెల్లం పానకం తయారు చేయించారు. నాలుగు బుట్టల తియ్యటి మామిడి పండ్లను ముక్కలుగా కోయించి సిద్ధం చేయించారు. ఇంతలో పెళ్ళి వారి గుంపు వచ్చేసింది. వారంతా హాయిగా పానకములు త్రాగి, పండ్లు తిని కాస్త కుదుట పడ్డారు. ఇంతలో పంచ భక్ష్య పరవాన్నాలతో అతి రుచికరమైన, సంతృప్తికరమైన భోజనాలతో వారికి విందు చేసారు సీతమ్మగారు. సాయంత్రము పొలము నుండి తిరిగి వచ్చిన జోగన్న గారు ఆశ్చర్యపడి "అంతర్వేది వెళ్ళలేదా?" అని సీతమ్మ గారిని అడిగారు. "ఇంతమందిని పస్తు పెట్టి, నేను దర్శనానికి వెడితే, ఆ నరసింహ స్వామి హర్షించడు. అందుకే తిరిగి వచ్చేసాను" అని చెప్పారు సీతమ్మగారు. అది విన్న జోగన్న గారు, ఆవిడ త్యాగ నిరతికి ఎంతో సంతోషించారు.

## కోడూరుపాడు రాజు గారి కుమార్తె:

కోడూరుపాడు రాజుగారు గర్భిణీ అయిన తమకుమార్తెను పుట్టింటికి పురిటికి తీసుకువెడుతున్నారు. మధ్యలో కోడేరు రేవు దాటగానే ఆమెకు నొప్పులు వచ్చాయి. లంకల గన్నవరం వచ్చేసరికి నొప్పులు ఎక్కువయ్యాయి. అప్పుడు వారిని సీతమ్మగారు తన ఇంట ఉంచుకొని, ఆ రాచ బిడ్డకు ఒక గది ప్రత్యేకముగా కేటాయించి, ఆమెకు పురుడు పోసారు. కన్న తల్లికన్న ఎక్కువగా పథ్యం భోజనాలు చేసి పెట్టి, ఒక నెల రోజులు తన ఇంటనే వుంచుకుని, అప్పుడు రాజు గారినీ, కుమార్తెనూ, మనుమరాలినీ చీర, సారె పెట్టి పసుపు కుంకుమలిచ్చి సాగనంపారు. ఊరిలో ఎవరింట బంధువులు వచ్చినా వారి ఇంటికి, పెరటి దారిన, కావలసిన కూరలు, వంట సామాగ్రి పంపేవారు. కాస్త పేదవారైతే వారి వారి పెళ్ళిళ్ళు తమ ఇంటి వద్దనే పందిళ్ళు వేయించి, తన స్వంత ఖర్చులతో వైభవంగా జరిపించేవారు. సీతమ్మగారు ఎన్నడూ కుల, మత, జాతి భేదములు పాటింపలేదు. నిరుపేదలు మొహమాట పడతారని గ్రహించి, వారికి తెలియకుండానే రహస్యంగా ఎన్నో సహాయాలు చేసేవారు. డొక్కా వారింటిలో అన్ని కులములవారు, జాతులవారు, మతములవారు, దేశములవారు సీతమ్మగారి అన్న ప్రసాదాన్ని తృప్తిగా ఆరగించేవారు.

*(తరువాయి వచ్చే సంచికలో)*

రుచికి, సువాసనకి, ఆరోగ్యానికి నాణ్యమైన
"అజంతా"
వక్కపొడి
రవికుమార్ అండ్ కంపెని - చెన్నై